# విలేఖరులు కావలెను



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా టుడే తెలంగాణ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లు కావలెను. అనుభవం ఆసక్తి గలవారు సంప్రదించండి

**98665 32777**

todaytelangananews6@gmail.com
www.todaytelangananews.com



TO-DAY TELANGANA
Telugu News Paper

# టుడే తెలంగాణ

తెలుగు దినపత్రిక — నిజం మా నైజం


**పంచాంగం - 05 ఫిబ్రవరి 2026 - గురువారం**

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం
ఉత్తరాయణం - శిశిర ఋతువు
మాఘ మాసం - కృష్ణపక్షం
సూర్యోదయం - ఉ. 6:50
సూర్యాస్తమయం - సా. 6:09
తిథి - చవితి రా. 12:26ం వరకు
తరువాత పంచమి
సంస్కృత వారం - బృహస్పతి వాసరః
నక్షత్రం - ఉత్తర ఫల్గుని(ఉత్తర) రా. 10:57 వరకు
తరువాత హస్త
యోగం - సుకర్మ రా. 12:05ం వరకు
కరణం - బవ మ. 12:14 వరకు, బవ మ. 12:14 వరకు
వర్జ్యం - తె. 5:37 నుండి ఉ. 7:16 వరకు
దుర్ముహూర్తం - ఉ. 10:36 నుండి ఉ. 11:22 వరకు, మ. 3:08 నుండి మ. 3:53 వరకు
రాహుకాలం - మ. 1:55 నుండి మ. 3:19 వరకు
యమగండం - ఉ. 6:50 నుండి ఉ. 8:15 వరకు
గుళికాకాలం - ఉ. 9:40 నుండి ఉ. 11:05 వరకు
బ్రహ్మ ముహూర్తం - తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు
అమృత ఘడియలు - మ. 3:31 నుండి సా. 5:10 వరకు
అభిజిత్ ముహూర్తం - మ. 12:07 నుండి మ. 12:52


సంపుటి: 3 సంచిక: 127 www.todaytelangananews.com తెలంగాణ / ఆంధ్ర ప్రదేశ్ గురువారం, ఫిబ్రవరి 05 2026 పేజీలు: 8 వెల: రూ. 5/-

Published from , Suryapet, Nalgonda, Khammam, Bhadradri Kothagudem, Hyderabad, Ranga reddy, Nizamabad, Adilabad ,


## మణిపూర్ సిఎంగా యమునాం ఖేమ్‌చంద్ ప్రమాణం




**ఇంఫాల్,ఫిబ్రవరి 4 :**మణిపూర్ ముఖ్యమంత్రిగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేశారు. బుధవారం నాడు రాజధాని ఇంఫాల్‌లోని రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రిగా ఖేమ్‌చంద్ సింగ్ చేత.. ఆ రాష్ట్ర గవర్నర్ అజయ్ కుమార్ భల్లా ప్రమాణ మిగతా2లో...

## లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళన

- నేటికి వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా






## వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

- ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి బండి సంజయ్
- పోలీసులు నిష్పక్షపాతంగా ఉండాలని హితవు

**వేములవాడ,ఫిబ్రవరి 4 :** వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్, భారాసకు ఎందుకు ఓట్లేయాలి?కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి మిగతా2లో...

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

- సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి
- మున్సిపల్ ఎన్నికల తరవాత రైతుభరోసా
- రైతులకు గిట్టుబాటు ధరతో పాటు
- రూ.500 బోనస్ ఇస్తున్నాం
- తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్
- తెలంగాణ తల్లి మన సోనియమ్మ
- మిర్యాలగూడ ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి



**మిర్యాలగూడ,ఫిబ్రవరి 4 :** రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ మిగతా2లో...




## స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

- కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్ ఆగ్రహం

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :**ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు మిగతా2లో...

# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట



- సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్
- అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం
- ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం
- మీడియాతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. మిగతా2లో...

## క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

- ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి
- అవగాహన కోసం షార్ట్ ఫిలిమ్స్ తీస్తా
- క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి



**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** క్యాన్సర్‌పై అందరి లోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు. శరీరంలో వచ్చే మార్పులు గమనించాల ని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి మిగతా2లో...

## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో..

- తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు' అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి

మిగతా2లో...



## ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం




- ఎస్సీ, ఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు
- నిజాం నిరంకుశంపై అంకుశం దింపిన గడ్డ
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సిఎం రేవంత్
- మహబూబ్‌నగర్ ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్దిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు.

# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు. సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 4 :** తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపిం చారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు. నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమీషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపు నిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చా రంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యా యని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం' అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేద ని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు.

# బిజెపి అభ్యర్థులకు బూస్ట్

## • ప్రచారం చేయనున్న పవన్ కళ్యాణ్



**హైదరాబాద్,ఫిబ్రవరి 4 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కళ్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కళ్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కళ్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల పక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

**ఖమ్మం,ఫిబ్రవరి 4 :** తెలంగాణ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో జాబితా పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత లబ్దిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.

ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్దిదారుల ఖాతాల్లో ఆ మొత్తం నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పేదలు ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

# మణిపూర్ సిఎంగా యమునాం ఖేమ్‌చంద్ ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

స్వీకారం చేయించారు. బీజేపీ ఎమ్మెల్యే నెమ్చా కిప్‌జెన్, నాగా పీపుల్స్ ఫ్రంట్ ఎమ్మెల్యే ఎల్.డిఖో డిప్యూటీ సీఎంలుగా ప్రమాణ స్వీకారం చేశారు. గతేడాది మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనను ఇవాళ(ఫిబ్రవరి 04న) ఎత్తివేస్తూ రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేశారు. ఆ వెంటనే ముఖ్యమంత్రిగా యుమునాం ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఖేమ్‌చంద్ సింగ్‌ను ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఎన్నుకున్నారు. 2023లో మే మాసంలో జాతుల మధ్య ఘర్షణల కారణంగా మణిపూర్ రాష్ట్రం అట్టుడికింది. దాంతో 250 మందికి పైగా ప్రజలు మరణించారు. వేలాది మంది రాష్ట్రం విడిచి దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిపోయారు. ఆ తర్వాత అంటే.. ఈ ఘర్షణలు చోటుచేసుకున్న దాదాపు తొమ్మిది నెలల అనంతరం బీరెన్ సింగ్.. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దాంతో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంకోవైపు ప్రస్తుత సీఎం ఖేమ్‌చంద్ సింగ్.. 2017 నుంచి 2022 వరకు మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా వ్యవహరించారు. బీరెన్ సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా కీలక బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలోని మైతేయిలు, కుకీలు, నాగాలతో ఖేమ్‌చంద్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. దీంతో ఆయనను ముఖ్యమంత్రిగా ఎంపిక చేయాలని బీజేపీ అగ్రనాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# లోక్‌సభలో విపక్ష సభ్యుల ఆందోళన

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 4 :** విపక్ష సభ్యుల ఆందోళనల మధ్య లోక్‌సభ గురువారం నాటికి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. లోక్‌సభలో ప్రసంగించాల్సి ఉంది. అయితే మోదీ ప్రసంగానికి ముందే సభను స్పీకర్ గురువారానికి వాయిదా వేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండటంతో సభ బుధవారం నాడు మూడుసార్లు వాయిదా పడింది. తొలుత సభ ప్రారంభం కాగానే భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ జరపాలంటూ విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గందరగోళ పరిస్థితుల మధ్య మధ్యాహ్నం 12 గంటల వరకూ లోక్‌సభ వాయిదా పడింది. దీంతో విపక్ష సభ్యులు పార్లమెంటు మెట్ల వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభం కాగానే మళ్లీ గందరగోళం తలెత్తింది. దీంతో మధ్యాహ్నం 2 గంటలకు సభలో సమాధానం ఇస్తానని కేంద్ర మంత్రి పీయూష్ గెయల్ చెప్పడంతో సభ రెండోసారి వాయిదా పడింది. తిరిగి 2 గంటలకు సభ ప్రారంభం కాగానే పీయూష్ గోయల్ మాట్లాడుతుండగా.. 8 మంది ఎంపీలను సమావేశాల నుంచి బహిష్కరించడంపై స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో సాయంత్రం 5 గంటలకు సభ వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. తిరిగి సభ ప్రారంభమై మోదీ ప్రసంగించాల్సి ఉండగా దీనికి ముందే స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

# పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో..

(మొదటి పేజీ తరువాయి)

మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

# వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంజయ్ పాల్గొన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమీషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్దతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని అన్నారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

(మొదటి పేజీ తరువాయి)

లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

# క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# ఎమ్మెల్యే సంజయ్‌కి మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్

**జగిత్యాల, ఫిబ్రవరి 04:** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం నాడు జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 'ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై శాసనసభ స్పీకర్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నా అని సంజయ్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నా. సంజయ్ నీకు దొంగ బుద్ధి ఎందుకు?. స్పీకర్ తీర్పుతో పద్ధతిగా ఉండు. నా కాంగ్రెస్ పార్టీలో చిచ్చుపెట్టకు. నీ బీఆర్ఎస్ పార్టీలో నువ్వు కరెక్ట్‌గా ఉండు. నా పార్టీ అంతర్గత విషయాల్లో ఎందుకు వేలు పెడుతున్నావు?. అభివృద్ధి అంటే పక్కింట్లోకి కన్ను వేయడమా?. గడిచిన



రెండు ఏళ్లలో సీఎం రేవంత్‌తో ఉండి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటీ చెప్పు.. సంజయ్?' అని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు ఏడాదిన్నర కాలంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనూ ఘాటుగా విమర్శించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్లు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించినట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఎస్.ఓ.ఎఫ్. (సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్) పరీక్షలలో శాస్త్ర ది న్యూ ఏజ్ స్కూల్ విద్యార్థుల అద్భుత ఫలితాలు

**టుడే తెలంగాణ న్యూస్ (సూర్యాపేట)**
సూర్యాపేటలోని శాస్త్ర ది న్యూ ఏజ్ స్కూల్, నవంబర్ 2025లో నిర్వహించిన సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ (ఎస్.ఓ.ఎఫ్.) పరీక్షలలో విశేష విజయాన్ని సాధించింది. విద్యార్థులు వివిధ ఒలింపియాడ్లలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి, సంస్థకు గొప్ప కీర్తిని తెచ్చారు. ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ (ఐ.ఈ.ఓ.)లో 15 మంది విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ (ఐ.జి.కె.ఓ.)లో 40 మంది విద్యార్థులు బంగారు పతకాలను గెలుచుకున్నారు. మొత్తం 61 మంది విద్యార్థులు రెండవ స్థాయి పరీక్షలకు ఎంపికయ్యారు, ఈ పరీక్షలు ఫిబ్రవరి 8, 2026న బాహ్య కేంద్రాలలో నిర్వహించబడతాయి. రెండవ స్థాయికి ఎంపికైన విద్యార్థుల కేటగిరీల వారీగా వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:ఐ.ఈ.ఓ-- 26 మంది విద్యార్థులు ఎన్.ఎస్.ఓ-- 32 మంది విద్యార్థులుఐ.ఎం.ఓ-- 3 గురు విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో, మన ప్రియతమ చైర్మన్ శ్రీ మైనం చంద్రశేఖర్ గారు మరియు డైరెక్టర్లు శ్రీమతి ఎం. కరుణ, శ్రీమతి వై. పుష్పలత గార్ల చేతుల




మీదుగా విజేతలకు పతకాలు మరియు ప్రశంసాపత్రాలు అందజేశారు. వారు విద్యార్థులను అభినందించి, వారి అంకితభావం మరియు కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీ ఎస్.కె. జహంగీర్, ఒలింపియాడ్స్ ఇన్‌ఛార్జ్ శ్రీ ఎం. సురేష్, ఐఐటి ఫౌండేషన్ అధ్యాపకులు, బోధన మరియు బోధనేతర సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులు సాధించిన అద్భుత విజయాలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్ విద్యా పోటీలలో కూడా విద్యార్థులు రాణించి, సంస్థకు మరిన్ని కీర్తి ప్రతిష్టలు తీసుకువస్తారని యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**టుడే తెలంగాణ న్యూస్ (సూర్యాపేట)** జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వి సి హాల్ నందు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ పనుల పురోగతి పై ఏపీడీలు, ఈసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ శక్తి, జన్ భాగిదారి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రతి మండలంలో ఒక గ్రామ పంచాయతీని గుర్తించి, మార్గదర్శకాల ప్రకారం నీటి సంరక్షణకు సంబంధించిన 20 రకాల పనులను ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
బోర్‌వెల్ రీచార్జ్, డెఫంక్ట్ బోర్‌వెల్, ఇంజెక్షన్ వెల్ , రూఫ్‌టాప్ వాటర్, హార్వెస్టింగ్ స్ట్రక్చర్, రీచార్జ్ షాఫ్ట్, రీచార్జ్ గుంత, సోక్



పిట్, తెరిచి ఉన్న బావి రీచార్జ్, డగ్ వెల్ కాంటూర్ ట్రెంచ్, గల్లి ప్లగ్, నాలా బండ్, గేబియన్ (వైర్ మెష్‌తో రాళ్ల కట్టడం), చెక్ డ్యామ్ , భూగర్భ అడ్డుకట్ట (సబ్ సర్ఫేస్ డైక్ -- ఫాణ) గ్రామ చెరువు, పర్కొలేషన్ చెరువు, ట్యాంక్ చెరువు, బెంచ్ టెర్రేసింగ్, ఏదైనా వినూత్నమైన తక్కువ ఖర్చుతో కూడిన నమూనా, ఇతరులుగుర్తించబడిన పనులు ప్రధానంగా వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల రీచార్జ్, సంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు ఈ పనుల ద్వారా నీటి లభ్యతను పెంపొందించడం మరియు భూగర్భ జల మట్టాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకోవాలని మరియు మహిళా శక్తి ఉపాధి భరోసా (6) రకాల పనులు) గుర్తించాలి అని మరియు గ్రామ పంచాయతీ వనమహోత్సవం నర్సరీ 2025-26 లో బ్యాగ్స్ లలో మట్టి నింపి విత్తనములు నాటడం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ డిఆర్డిఏ పి డి శిరీష, తుంగతుర్తి ఎంపీడీవో శేష్ కుమార్, డిఆర్డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదంలో మహిళా లాయర్‌ను హత్య చేసిన సోదరుడు

**రంగారెడ్డి జిల్లా :** మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో దారుణం చోటుచేసుకుంది. ఆస్తి గొడవల కారణంగా స్వప్న అనే యువ న్యాయవాదిని ఆమె సోదరుడే రాజు దారుణంగా హత్యచేశాడు. పొలం వద్ద సర్వే జరుగుతుండగా ఆమె అన్న స్వప్నను అత్యంత కర్కశంగా హతమార్చాడు. మృతురాలు స్వప్న చేవేళ్ల కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తోంది. ఈ హత్యను నిరసిస్తూ చేవేళ్ల కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించారు. మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రెండు సార్లు చంపేందుకు ప్రయత్నించాడు : మృతురాలు స్వప్న తల్లి వెంకటమ్మ పోలీసులు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. స్వప్న అన్న రాజు దారుణానికి ఒడిగట్టాడని కన్నీటి పర్యంతమయ్యారు. గత మూడేళ్లుగా స్వప్నను చంపాలని రాజు పథకం పన్నాడని, ఇప్పటికే రెండు సార్లు చంపేందుకు ప్రయత్నించాడని ఆరోపించారు. భూమి సర్వే చేసిన తర్వాత తిరిగి వెళ్తుండగా




ముగ్గురు వ్యక్తులు తన కుమార్తెపై దాడి చేశారని తెలిపారు. కర్రలతో కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారని వాపోయింది. నిందితుడు రాజుని కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు. భూ వివాదంలో మహిళా లాయర్?ను హత్య చేసిన సోదరుడు (పోలీసుల అదుపులో నిందితులు : న్యాయవాది స్వప్న హత్య కేసులో రాజుతో పాటు అతని డ్రైవర్ వీరేష్?ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరికొందరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హత్యకు భూవివాదాలే కారణమని భావిస్తున్నామని చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ తెలిపారు. పథకం ప్రకారమే సోదరి స్వప్నను రాజు హత్య చేశాడని, హత్య కేసులో మిగతా వారి కోసం గాలిస్తున్నామని ఆయన వివరించారు.

# మహనీయుల ఆశయాలే సామాజిక న్యాయానికి మార్గదర్శకాలు

## జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**టుడే తెలంగాణ న్యూస్ (సూర్యాపేట)** మహనీయులు ప్రతిపాదించిన ఆశయాలు, సిద్ధాంతాలే సామాజిక న్యాయం సాధించేందుకు మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ రంగాలలో సమానత్వం సాధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎంతో కీలకమని అన్నారు. కుల సర్వే నిర్వహణతో పాటు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ దిశగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సమాజంలోని వెనుకబడిన చివరి వ్యక్తికీ తగిన వనరులు, ప్రాతినిధ్యం మరియు ఆత్మగౌరవం కల్పించేందుకు దోహదపడతాయని తెలిపారు. సామాజిక న్యాయం సాధించాలంటే మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. అందరి అభ్యున్నతే లక్ష్యంగ విద్య, సామాజిక ప్రజాస్వామ్య విలువలు ప్రతి పౌరునికీ నిరంతర ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. ఈ విలువలను ఆచరణలోకి తీసుకువచ్చినప్పుడే సమానత్వం, న్యాయం సాకారమవుతాయని స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు, సిబ్బందితో కలిసి






సామూహిక ప్రతిజ్ఞ చేశారు. వివక్ష లేకుండా ప్రతి వ్యక్తిని గౌరవిస్తామని, సమానత్వం, న్యాయం మరియు గౌరవం కోసం నిలబడతామని, ఏ రూపంలోనైనా అన్యాయాన్ని సమర్థించబో మని ప్రతిజ్ఞ చేశారు. దయ, సానుభూతితో సమాజంలోని ప్రతి ఒక్కరినీ చూడడంతో పాటు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం తమ గళాన్ని వినిపిస్తామని తెలిపారు. రాజ్యాంగ సూత్రాలను పరిరక్షిస్తూ, న్యాయమైన, సామరస్య పూర్వకమైన మరియు సాధికారత కలిగిన తెలంగాణ రాష్ట్రం, భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారా మారావు, పిడి డిఆర్డి ఓ శిరీష, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి నరసింహ, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద రాణి, డి టి డి ఓ శంకర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి సుదర్శన్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# కోఠి కాల్పుల కేసు యూపీకి హైదరాబాద్ పోలీసులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** హైదరాబాద్‌లోని కోఠి ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్ద జరిగిన కాల్పులు, దోపిడీ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో పోలీసులు కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. గత నెల 31న ఉదయం నగదు జమ చేసేందుకు వచ్చిన రిన్షద్ అనే వ్యక్తిపై దుండగులు తుపాకీతో కాల్పులు జరిపి ఆరు లక్షల నగదును దోచుకుని పారిపోయారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు నిందితులు ఆటోల్లో చక్కర్లు కొట్టి, చివరకు చాంద్రాయణగుట్ట, బార్కస్ ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు సమాచారం అందింది. అయితే మరుసటి రోజే వారిద్దరూ ఉత్తరప్రదేశ్‌కు పరారైనట్లు తెలుస్తోంది. ఇద్దరు నిందితుల్లో ఒకరికి హైదరాబాద్‌లో ఇంతకుముందు నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. కొద్ది రోజుల క్రితమే యూపీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఈ నిందితులు.. బార్కస్ ప్రాంతంలో మకాం వేసినట్లు తెలుస్తోంది. నగరంలో ఉన్న స్థానికులు కొందరు ఈ దుండగులకు ఆశ్రయం ఇచ్చి సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సహకారం అందించిన వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో పాతబస్తీ ప్రాంతంలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అతడు నిందితులకు షెల్టర్ ఇచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరు లక్షల నగదుతో బ్యాగ్‌ను తీసుకుని హైదరాబాద్ నుంచి యూపీ వెళ్లిన నిందితులను పట్టుకోవడానికి.. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు యూపీలో కూడా గాలింపు చేపట్టారు. నాలుగు రోజులుగా నిరంతరం గాలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం, నిందితుడు పాత నేరస్థుడు కావడంతో యూపీ పోలీసుల సహకారంతో ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## గద్వాలలో రాజకీయ వ్యభిచారం సొంత పార్టీ కాంగ్రెస్‌పై జడ్పీ మాజీ చైర్మన్ తీవ్ర విమర్శలు

**జోగులాంబ గద్వాల :** గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ విభేదాలు రోడ్డున పడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఖ్య నాయకుల తీరుపై జిల్లా స్థాయిలో తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరితా తిరుపతయ్య పార్టీకి చెందిన నాయకులపై విరుచుకుపడ్డారు. రాష్ట్రం మొత్తం ఒకేలా ఉంటే గద్వాలలో మాత్రం రాజకీయ వ్యభిచారం



నడుస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌కు చెందిన జాతీయ, రాష్ట్ర నాయకులను అవమాన పరిచిన గద్వాల ప్రాంత నాయకులకు ప్రాదాన్యం ఇవ్వడంపై ఆమె మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో తనపై ఆశలు పెట్టుకొన్న అభ్యర్థులను గెలిపించుకుంటానని స్పష్టం చేశారు. బహుజన బిడ్డను అణగదొక్కడానికి కుయుక్తులు పన్నిన శక్తులపై రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. పూటకో మాట మార్చే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నారో ఎవరికి ఇంకా తెలియదని, అటువంటి వ్యక్తికి మున్సిపల్ ఎన్నికల్లో బీ ఫాంలు అందజేయడం శోచనీయమని అన్నారు. పార్టీని కష్టకాలంలో ఎవరు కాపాడింద్రో రాష్ట్ర నాయకులకు తెలుసు అని పేర్కొన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉందని పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. కొందరి బీ-ఫాంలు ఇచ్చి క్యాన్సల్ చేసి ఎమ్మెల్యేకు ఇవ్వడం పట్ల ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే అంటున్న సంజయ్ అవునా నిజమా అంటున్న జనం!


**హైదరాబాద్ :** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తీరుపై జనం ముక్కున వేలేసుకుంటున్నరు. 'నేను బీఆర్ఎస్ పార్టీ గుర్తు మీద గెలిచిన.. ఇప్పుడు కూడా నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే' అని డాక్టర్ సంజయ్ అంటున్నరు. ఎమ్మెల్యే సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేశారు. ఈ నేపథ్యంలో ఆయన బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగిత్యాల అబివృద్ధి కోసం రేవంత్ రెడ్డిని కలిసి



శాలువ కప్పుకున్నాడట. అంతే తప్ప పార్టీ మారలేదంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నేను ఎక్కడా చెప్పలేదట, సీఎం రేవంత్ రెడ్డి కూడా ఎక్కడా చెప్పలేదట. మీడియాతో మాట్లాడుతున్న సందర్భంలో కూడా సంజయ్‌కి ఇరువైపుల కూర్చున్న నేతలు మాత్రం కాంగ్రెస్ పార్టీ కండువాలు మెడలో వేసుకుని కూర్చున్నారు. ఇది చూస్తున్న జనం నవ్వుకుంటున్నారు. మీడియానే తనపై తప్పుడు ప్రచారం చేసిందని ఎమ్మెల్యే చెప్తున్నడు. బీఆర్ఎస్ పార్టీకి నెలకు రూ.5 వేలు కడుతున్నడట. బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నట్లు అఫిడవిట్ కూడా ఇచ్చానని చెప్తున్నడు. ఈయన మాటలు చూస్తున్న జగిత్యాల నియోజక వర్గ ప్రజలతోపాటు తెలంగాణ ప్రజానీకం పక్కున నవ్వుతున్నారు

## కాకతీయ కాలం నాటి చిత్రాలను పరిరక్షించాలి

**ధర్మసాగర్ :** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ముప్పారం గ్రామంలో ఉన్న పురాతనమైన ముప్పిరినాథ స్వామి ఆలయంలో ఉన్న కాకతీయుల కాలం నాటి ప్రాచీన చిత్రాలను ప్రభుత్వం పరిరక్షించాలని ప్లిచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో ఈమని శివనాగిరెడ్డి కోరారు. టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్యతో కలిసి ఆయన బుధవారం ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముప్పిరినాథ స్వామి ఆలయం క్రీ.శ. 1116--1157 మధ్యకాలంలో కాకతీయ రాజు ప్రోలరాజు-2 భార్య ముప్పమాంబ నిర్మించారని తెలిపారు. కాకతీయుల కాలం నాటి శిల్పకళకు అద్భుతమైన నిదర్శనంగా ఆలయ గోడలపై పంచతంత్ర కథలు, రామాయణ ఘట్టాలు తదితర దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు పరిరక్షణ చర్యల లోపం కారణంగా చిత్రాలు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేన వ్యక్తం చేశారు. టార్చ్ కార్యదర్శి అరవింద్ ఆర్య మాట్లాడుతూ ఎనిమిది శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయం ఇప్పటికీ రాష్ట్ర పురావస్తు శాఖ పరిరక్షణలోకి రాకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర పురావస్తు శాఖ స్పందించి ఆలయాన్ని, అరుదైన కాకతీయుల కాలం నాటి చిత్రాలను కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్ వ్యవస్థాపక చైర్మన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.



TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# 2026-27 ఏపీ బడ్జెట్ పయ్యావుల కీలక చర్చలు వాటిపైనే స్పెషల్ ఫోకస్



**అమరావతి, ఫిబ్రవరి 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆర్థిక మంత్రి వరుసగా ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు శాఖలకు చెందిన మంత్రులతో సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు.సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బడ్జెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహి ంచేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచా రం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయి ంచనున్నట్లు తెలుస్తోంది.రోడ్ల అభివృద్ధిపైనా ఈ బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బడ్జెట్ కేటాయింపులపై ముఖ్యమ ంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.

## ఏపీలో హింసపై జాతీయ మానవహక్కుల కమిషన్‌కు వైసీపీ ఫిర్యాదు



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న హింసాత్మక వాతావరణం ,నిరంకుశ పాలనపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్() కు బుధవారం ఫిర్యాదు చేశారు. . ఈమేరకు ఛైర్మన్ జస్టిస్ సుబ్రహ్మణ్యం ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై ఇటీవల జరిగిన దాడులు , వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త సల్మాన్ రాజు దారుణ హత్యను చైర్మన్‌కు వివరించారు. టీడీపీ నాయకులు రాజకీయ ప్రత్యర్థులను భౌతికంగా అంతమొందించడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ హక్కులను పరిరక్షించడానికి కమిషన్ జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వీడియోలు, ఫోటోల రూపంలో సాక్ష్యాలను సమర్పించారు.సల్మాన్ రాజు హత్య వెనుక పెద్ద రాజకీయ కుట్ర ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని, ప్రజాస్వామ్యానికే తీవ్ర ముప్పు వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బృందంలో ఎంపీలు వై.వి. సుబ్బారెడ్డి, పి.వి. మిథున్ రెడ్డి, పలువురు ఇతర ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు మరియు ఎస్సీ సెల్ నాయకులు ఉన్నారు.

## ఏసీబీ కోర్టు ఉత్తర్వులపై హైకోర్టులో విచారణ





**అమరావతి, ఫిబ్రవరి 4:** వైసీపీ ప్రభుత్వంలో అప్పటి విపక్ష నేత చంద్రబాబు తదితరులపై నమోదైన కేసులకు సంబంధించిన రికార్డులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. సీఐడీ తరఫు న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరి కౌంటర్ వేసేందుకు సమయం కోరడంతో విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. "ఫైబర్‌గ్రిడ్, మద్యం పాలసీలకు సంబంధించి వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబు తదితరులపై నమోదు చేసిన కేసులను విజయవాడ ఏసీబీ కోర్టు మూసివేసింది. ఈ కేసులకు సంబంధించిన తీర్పు ప్రతులతో పాటు రికార్డులన్నింటినీ ఇవ్వాలని కోరగా కోర్టు నిరాకరించింది." అని పేర్కొంటూ రిటైర్డ్ రైల్వే ఉద్యోగి యేము కొండలరావు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా మూడో పక్షం తీర్పు ప్రతులు పొందడానికి సహజంగా అనుమతించబోమని, ఏసీబీ కోర్టు తీర్పు ప్రతులతో మీరు పొందే ప్రయోజనం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది.

# అనుమతి లేకున్నా గుంటూరుకు జగన్ భారీగా ట్రాఫిక్ జామ్



**గుంటూరు, ఫిబ్రవరి 4:** మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి మంది మార్బలంతో గుంటూరుకు బయలుదేరారు మాజీ సీఎం. ఈ క్రమంలో గుంటూరు - విజయవాడ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో కనీసం అంబులెన్స్‌లకు కూడా దారి లేకుండా పోయింది. ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ట్రాఫిక్ ఇబ్బందులపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అయితే గతంలో పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో జగన్ పర్యటనల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలీసు ఆంక్షలు విధించారు. ఎడ్లపాడు జాతీయ రహదారిపై వైసీపీ నేతల వాహనాలను పోలీసులు నిలిపివేస్తున్నారు. గుంటూరులో జగన్ పర్యటనకు వెళ్లకుండా ఆంక్షలు పెట్టి, పలువురు వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వైసీపీ కేడర్ తరలివెళ్తోంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు దగ్గర తనిఖీలు నిర్వహి ంచి ఎక్కడికక్కడ వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు.

# తిరుమలతో రాజకీయం చేస్తే వినాశనం తప్పదు




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4:** వైసీపీ నాయకులపై టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. హిందువుల ఆరాధ్య దైవం కలియుగ వేంకటేశ్వర స్వామి, హిందువుల ఆధ్యాత్మిక రాజధాని తిరుమల క్షేత్రాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని సూచించారు. తిరుమల చుట్టూ రాజకీయాలు తిరిగితే వినాశనమే జరుగుతు ందన్నారు. వైసీపీ నాయకులు తిరుమల చుట్టూ గిరిప్రదక్షిణ చేసి పుణ్యం సంపాదించుకోవాలని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రజలు ఇప్పటికే వైసీపీని 11 స్థానాలకు పరిమితం చేశారని, అయినా సిగ్గు లేకుండా స్వామివారితో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యంలో ఉన్నామా..వైసీపీ హయాంలో తిరుమల లడ్డూలో నెయ్యి కాకుండా కల్తీ పదార్థాలు వాడారని సిట్ నివేదికలో స్పష్టంగా ఉందని భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నా రు. కొందరు వైసీపీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక రాక్షస పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలకు జైత్రయాత్ర అనేది లేదని, ఎన్నడూ లేని విధంగా దీపావళికి జగన్ మోహన్ రెడ్డి టపాసులు కాల్చారని విమర్శించారు. టపాసులు కాల్చుకోవడానికి వైసీపీ నేతల శేష జీవితం సరిపోతుందని ఆయన సెటైర్ వేశారు.తిరుమలే టార్గెట్‌గా..2019-2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల పాలు చేశారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతుంటే జగన్ మోహన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని అన్నారు. టార్గెట్ తిరుమలగా వైసీపీ నేతలు పని చేస్తున్నట్లు విమర్శించారు. వైసీపీ దుర్మార్గులు ఇప్పుడు ఏపీ మీద పడ్డారన్నారు. పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని.. వైసీపీ నేతలు ఏడుస్తున్నారని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో ధృతరాష్ట్రుడి పాలన జరిగిందంటూ ఆయన వ్యాఖ్యానించారు.అందరూ బయటకొస్తారు..సిట్ నివేదికలో కోట్ల రూపాయలు హవాలా మార్గంలో చేతులు మారాయని తేలిందని భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. కల్తీ నెయ్యి వెనుక ఉన్న కుట్రదారులు, పాత్రధారులు బయటకు వస్తారని తెలిపారు. కుల రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌ను వేదికగా చేసుకోవద్దని సూచిం చారు. ఆంబోతులను రోడ్లపైకి వచ్చి.. ఇష్టాను సారంగా మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. ఈరోజు ఇంకో నాయకుడు (జగన్) గుంటూరుకు బయలుదేరారని చెప్పారు. రోడ్డుపై ఆంబోతులు గొడవ చేస్తే వదిలేస్తామా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఆందోళనలు.. జగన్ ప్రీ ప్లాన్ స్కెచ్‌గా భావిస్తున్నామని తెలిపారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే గందరగోళం చేస్తున్నారని భాను ప్రకాష్ రెడ్డి ఆరోపించారు.మనిషిలా ప్రవర్తించాలి...2019 నుంచి 2024 వరకు తిరుమలలో చేసిన అపచారాలపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని భాను ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. వైవీ సుబ్బారెడ్డి ఢిల్లీకి వచ్చి కల్తీ నెయ్యిపై నీతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. భవిష్యత్తులో తామే అధికారంలోకి వస్తామని వైసీపీ నేతలు అనుకుంటున్నారని.. భోగి పండుగకు డ్యాన్సులు, దీపావళికి టపాసులు తప్ప జైత్రయాత్ర చేసేది లేదని వ్యంగ్యంగా విమర్శించారు. మనిషిలాగా ప్రవర్తించాలి కాని ఆంబోతులాగా కాదని టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి సూచించారు.

## తిరుమలను దర్శించుకున్న యాదుగిరి యతిరాజ మఠం పీఠాధిపతి



**తిరుమల :** మేల్కోటేలోని శ్రీ యాదుగిరి యతిరాజ మఠం పీఠాధిపతి యాదుగిరి యతిరాజ నారాయణ రామానుజ జీయర్ బుధవారం ఉదయం తిరుమల శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఆయనకు ఆలయ అధికారులు , అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు నరేష్ కుమార్, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.భక్తుల రద్దీ సాధారణం. వేంకటేశ్వ రస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. నిన్న స్వామివారిని 69,389 మంది భక్తులు దర్శించుకోగా 20,247 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల రూ. 3.72 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వివరించారు. టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం అవుతుందని తెలిపారు.

# అంబటి, జోగి లాంటి బ్యాచ్‌లు ఇంకా ఉన్నాయి: భూమా అఖిల ప్రియ



**కర్నూలు:** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్, జగన్ ఇద్దరూ రైతుల కడుపు కొట్టి తమ కడుపులు నింపుకొన్నారని మండిపడ్డారు. రైతులకు మేలు చేయాల్సిన పాలకులు.. స్వార్థ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ లాంటి నేతల బ్యాచ్ ఇంకా వైసీపీలో కొనసాగుతోందని అన్నారు. లోకేష్ అన్న ఒక్కసారి కనుసైగ చేస్తే.. వైసీపీ నేతలు మైకుల ముందు మాట్లాడలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచన మేరకు తమ ఆవేశాన్ని కంట్రోల్ చేసుకుని, ఆలోచనా విధానాన్ని మార్చుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టామని అఖిలప్రియ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. అంబటి, జోగి లాంటి నేతలు తమ ఇష్టానుసారంగా మాట్లాడితే జగన్ వారిని వెనకేసుకొస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలు ఏ ముఖం పెట్టుకుని సీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ దగ్గరకు వెళ్తున్నారని ప్రశ్నించారు. సీమ రైతులకు వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. వైసీపీ నేతల మాటలను వారి ఇళ్లలో ఉన్న భార్యలే వినరని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి హాజరు కాకుండా ఎమ్మెల్యేలు జీతాలు ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు ప్రజల డబ్బుతో జీతాలు ఇవ్వడం అన్యాయమని అఖిలప్రియ అభిప్రాయపడ్డారు.

## రాజమండ్రిలో కలకలం స్కూల్ వైపు వెళ్లిన పెద్దపులి



**రాజమండ్రి, ఫిబ్రవరి 4:** కొద్ది రోజుల నుంచి రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పెద్దపులి కలకలం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా, దివాన్ చెరువు సెంటర్ సమీపంలో పెద్దపులి సంచరిస్తూ కనిపించింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎస్‌వీపీసీ ఫంక్షన్ హాల్ దగ్గర కూడా జనాలకు కనిపించింది. పెద్ద పులి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వైపు వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఓ చోట పెద్దపులి తిరుగుతుండగా కారులో నుంచి కొంతమంది యువకులు వీడియో తీశారు. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గాడాల దగ్గర పెద్దపులి పాదముద్రలు కనిపించటంతో అధికారులు బోన్ ఏర్పాటు చేశారు.మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. ఫిబ్రవరి 1న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే కనిపించింది. ఇక, నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు కనిపించింది. పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు.

# నాన్న ఆదేశాలతో అన్ని రకాల సేవలూ అందిస్తున్నాం



**హైదరాబాద్, ఫిబ్రవరి 4:** బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన చికిత్స అందిస్తున్నట్లు హిందూపురం ఎమ్మెల్యే, ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ తెలిపారు. (బుధవారం) బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ అండ్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్రాకీథెరపీ యూనిట్, రెండు ఆపరేషన్ థియేటర్లు, మోల్డ్ రూమ్స్, అదనపు క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాన్ని బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2007లో దేశంలోనే తొలిసారిగా క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ వాహనాన్ని అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేతుల మీదుగా ఆవిష్కరించారని తెలిపారు. ఇప్పటి వరకు 3 లక్షలకు పైగా స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించగా.. ఈ ఏడాది ఇప్పటికే 56 వేలకు పైగా పరీక్షలు చేశామని బాలకృష్ణ తెలిపారు.మామోగ్ర ఫీతో పాటూ అన్ని రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఈ మొబైల్ వాహనంలో నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. స్క్రీనింగ్ తర్వాత అవసరమైన వారిని ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. నాన్న నందమూరి తారక రామారావు ఆదేశాల మేరకు ఆస్పత్రిలో అన్ని రకాల సేవలూ అందిస్తూ రోగులకు ఓదార్పునిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా క్యాన్సర్ గురించి సులభంగా అర్థమయ్యేలా ఒక పుస్తకాన్ని ఆవిష్కరించినట్లు బాలయ్య తెలిపారు. మొబైల్ వాహనంలో ‌క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాన్ని స్కాన్ చేస్తే క్యాన్సర్ గురించి పూర్తి అవగాహన కల్పించే సమాచారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. సీఎమ్ఐ ప్రోగ్రాం ద్వారా రోగులకు ఎన్నో ప్రయోజనాలు అందుతు న్నాయని పేర్కొన్నారు. సాంబశివ రావు వీల్‌చైర్లను డొనేట్ చేసినందుకు నందమూరి బాలకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు.

TO-DAY TELANGANA
Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక
నిజం మా నైజం

# వాణిజ్య ఒప్పందం జరిగి 36 గంటలు దాటింది ట్రేడ్ డీల్ వివరాలేవి కేంద్రానికి కాంగ్రెస్ ప్రశ్నలు

పార్లమెంట్ సమావేశాల వేళ భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అంశం రాజకీయ దుమారం రేపుతోంది. రెండు సభలను కుదిపేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి మేరకు ఈ ఒప్పందం తక్షణమే అమల్లోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించి 36 గంటలు దాటినా, ఇప్పటి వరకు డీల్?పై పూర్తి వివరాలతో కూడిన సంయుక్త ప్రకటన వెలువడలేదని పేర్కొంది. వాణిజ్య ఒప్పందం గురించి స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ పలు ప్రశ్నలను సంధించింది."భారత ప్రధాని మోదీ అభ్యర్థన మేరకు ఇండియా- యూఎస్ వాణిజ్య ఒప్పందం కుదిరిందని, ఇది తక్షణమే అమల్లోకి వస్తోందని ట్రంప్ ప్రకటించి 36 గంటలు అవుతోంది. అమెరికా ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్‌లను భారత్ తగ్గించిందని తెలుస్తోంది. అయితే ఈ డీల్‌పై ఇంకా ఎటువంటి స్పష్టత లేదు. కనీసం ఉమ్మడి ప్రకటన కూడా లేదు. "అని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ ఆందోళనమరోవైపు భారత్?- అమెరికా మధ్య కుదిరిన



ఒప్పందంపై కాంగ్రెస్ సహా విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ డీల్ వల్ల దేశంలోని రైతులు, పాడి, దేశీయ పరిశ్రమలపై పడే ప్రభావం గురించి ప్రశ్నించాయి. దేశంలోని రైతులు, పాడి పరిశ్రమకు అండగా ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. భారత ఎగుమతులపై 25 శాతం నుంచి 18 శాతానికి సుంకాలు తగ్గింపుపై స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అమెరికాకు చెందిన కొన్ని వస్తువులపై భారత్ సుంకాలు సున్నాకి తగ్గించిందని ట్రంప్ చేసిన ప్రకటనపైనా కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో తాజాగా భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం వివరాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది.అమెరికా-భారత్‌ల మధ్య ఇటీవల ట్రేడ్ డీల్ కుదిరింది. దీంతో ఇకపై భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ క్రమంలో ఈ డీల్‌ను భారతదేశ వృద్ధి పథాన్ని వేగవంతం చేసే మైలురాయిగా కేంద్రం అభివర్ణించింది.

# లోక్‌సభ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 04:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకున్నాయి. దాంతో బుధవారం సైతం సభ పలుమార్లు వాయిదా పడింది. ఈ రోజు ఉదయం సభ ప్రారంభమైన వెంటనే భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చి జరగాలంటూ విపక్ష పార్టీల సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో మధ్యాహ్నం 12.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.విపక్ష సభ్యులంతా పార్లమెంట్ మెట్ల మీదకు చేరుకుని.. ప్లకార్డులు పట్టుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఇక పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకర్లతో మాట్లాడుతూ.. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాసిన లేఖకు తాము సమాధానం ఇచ్చామన్నారు.కానీ ఆయన ఏకపక్షంగా మాట్లాడుతున్నారంటూ రాహుల్ తీరుపై కిరణ్ రిజిజు మండిపడ్డారు. సభ 12.00 గంటలకు ప్రారంభమైంది. సభలో సభ్యుల తీరు మారలేదు. భారత్, అమెరికా ఒప్పందంపై కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ



మంత్రి పియూష్ గోయల్ మధ్యాహ్నం 2.00 గంటలకు సభలో సమాధానం ఇస్తారని ప్రకటించిన అనంతరం సభను వాయిదా వేశారు.మళ్లీ సభ ప్రారంభమైన అనంతరం మంత్రి పీయూష్ గోయల్ భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై సభలో మాట్లాడారు. విపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ప్లకార్డులు ప్రదర్శించారు. దాంతో సాయంత్రం 5.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.మరోవైపు రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోదీ ఈ రోజు అంటే.. బుధవారం లోక్‌సభలో ధన్యవాదాలు తెలపనున్నారు. ఇంకోవైపు ప్రధాని సభకు వస్తే.. ఆర్మీ మాజీ చీఫ్ నరవణె రాసిన పుస్తకాన్ని ఆయనకు తాను స్వయంగా అందజేస్తానని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఆ పుస్తకాన్ని పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీ ప్రదర్శించారు. ప్రధాని మోదీ భయపడ్డారని.. ఈ రోజు ఆయన సభకు రారంటూ రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు.నరవణె పుస్తకంలోని అంశాలపై చర్చించాలంటూ మంగళవారం లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. ఆయనకు మద్దతుగా 8 మంది ఎంపీలు స్పీకర్ ఎదుట నిరసనకు దిగారు. ఆ క్రమంలో కాగితాలను చించి స్పీకర్‌పైకి వారు విసిరారు. ఈ నేపథ్యంలో సదరు ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే

# ప్రధాని మోదీకి జనరల్ నరవణే రాసిన పుస్తకం అందజేస్తా

**న్యూఢిల్లీ:** మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ నరవణే రాసిన పుస్తకం వివాదం చెలరేగిన వేళ ప్రధాని నరేంద్ర మోదీకి స్వయంగా ఆ బుక్‌ను అందజేస్తానని వెల్లడించారు కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ. 2020లో భారత్-చైనా సరిహద్దు వివాదం సమయంలో ప్రధాని మోదీ తన బాధ్యతను సరిగ్గా నిర్వర్తిం చలేదని మండిపడ్డారు. డోక్లాం ప్రతిష్టంభన బాధ్యతను అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణెపైకి నెట్టేశారని విమర్శించారు. పార్లమెంట్ వెలుపల మీడియాతో రాహుల్ మీడియాతో మాట్లాడారు. ఈ క్రమంలో మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఆ సమయంలో రాహుల్ ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన బుక్‌ను చేతిలో పట్టుకున్నారు.చైనా దురాక్రమణపై భారత సైన్యం మాజీ అధిపతి ఎంఎం నరవణె రాసిన బుక్‌ను ప్రధాని మోదీకి అందజేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఆ పుస్తకంలోని విషయాలు లద్దాఖ్ సంక్షోభ సమయంలో ప్రభుత్వ ప్రతిస్పందన గురించి నిజాలను వెల్లడిస్తాయన్నారు. "ఈ బుక్ అసలు లేదని, స్పీకర్, కేంద్ర ప్రభుత్వం, రక్షణ మంత్రి రాజ్?నాథ్ చెప్పారు. దేశంలోని ప్రతి యువకుడు ఈ పుస్తకం ఉందని గమనించాలి. లద్దాఖ్‌లో ఏం




జరిగిందో నరవణె పూర్తి వివరాలను ఈ బుక్‌లో రాశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన బుక్ భారత్‌లో ప్రచురించడానికి ప్రభుత్వం అనుమతించడం లేదు. ఈ బుక్ విదేశాల్లో ప్రచురితమైంది." అని రాహుల్ స్పష్టం చేశారు." ప్రధాని మోదీ బుధవారం లోక్‌సభకు వస్తారని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే మోదీకి సభకు వస్తే నేను నేరుగా వెళ్లి ఆయనకు నరవణె రాసిన పుస్తకాన్ని ఇస్తాను. తద్వారా ఆ పుస్తకాన్ని చదివి మోదీ నిజాలను తెలుసుకుంటారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె రాసిన బుక్ లద్దాఖ్‌లో జరిగిన ఘటనలను వివరిస్తుంది. దీనిని ముఖ్యంగా దేశంలోని యువత చదవాలి. కైలాష్ రిడ్జ్ ప్రాంతంలో చైనా దళాలు, వారి ట్యాంకుల మోహరింపు గురించి ఈ బుక్‌లో నరవణె హైలెట్ చేశారు. "--రాహుల్ గాంధీ, లోక్‌సభలో విపక్ష నేతచైనా ట్యాంకులు కైలాష్ రిడ్జ్ వద్దకు చేరుకున్నప్పుడు అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ నరవణె వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను సంప్రదించారని రాహుల్ తెలిపారు. అప్పుడు నరవణెకు రాజ్‌నాథ్ సరైన సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. ఆ తర్వాత నరవణె విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను సంప్రదించారని, అప్పుడూ స్పష్టమైన స్పందన రాలేదన్నారు. అందుకే ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణె తన పుస్తకంలో తాను ఒంటరినయ్యాని రాసుకొచ్చారు. అంటే మోదీ తన బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించలేదని అర్థం. ప్రధాని మోదీ ఈ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించాలి. లద్దాఖ్ ప్రతిష్టంభన సమయంలో తన పాత్రను దేశ ప్రజలకు వివరించాలి. దేశానికి జాతీయ భద్రత విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం అవసరం." అని రాహుల్ పేర్కొన్నారు.

# బంగాల్‌ను టార్గెట్ చేస్తున్నారు ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

**బంగాల్ : బంగాల్**లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ా×=) ప్రక్రియపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టు వేదికగా తీవ్ర స్పందించారు. బంగాల్‌ను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేశారని, ఎస్?ఐఆర్ ప్రక్రియ కేవలం తమ రాష్ట్రంలో అసలైన ఓటర్లను తొలగించడానికే ఉపయోగపడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజలను ఎస్?ఐఆర్ పేరుతో బుల్డోజ్ చేస్తున్నారని విమర్శించారు. బుధవారం ఎస్?ఐఆర్ అంశంపై సుప్రీంకోర్టులో మమతా బెనర్జీ స్వయంగా తన ధర్మాసనం ముందుకు వచ్చి వాదనలు వినిపించారు. ఒక సిట్టింగ్ ముఖ్యమంత్రి ఇలా నేరుగా కోర్టులో వాదనలు వినిపించడం అత్యంత అరుదైన విషయం. ఆమె విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, కేంద్ర



ఎన్నికల సంఘానికి, బంగాల్ ప్రధాన ఎన్నికల అధికారికి నోటీసులు జారీ చేసింది. ఫిబ్రవరి 9వ తేదీలోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది."బంగాల్‌ను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేశారు. అసోం రాష్ట్రంలో ఎస్ఐఆర్ కోసం ఏ నిబంధనలు పాటించారు? అక్కడ పాటించిన ప్రమాణాలను ఇక్కడెందుకు పాటించడం లేదు? మాకు ఎక్కడా న్యాయం జరగడం లేదు. ఇప్పటికే ఎన్నికల సంఘానికి నేను ఆరు లేఖలు రాశాను. అయినా స్పందన లేదు" అని ఆమె ధర్మాసనానికి వివరించారు. విచారణ ముగిసే సమయంలో, తన వాదనలు వినిపించే అవకాశం ఇచ్చినందుకు ధర్మాసనానికి కృతజ్ఞతలు తెలిపారు.1.36 కోట్ల మందికి నోటీసులుమమత తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ కోర్టుకు గణాంకాలను సమర్పించారు. "రాష్ట్రంలో 'లాజికల్ డిస్క్రిపెన్సీ' లేదా సాంకేతిక లోపాల పేరుతో ఏకంగా 1.36 కోట్ల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చారు. తల్లిదండ్రుల పేర్లలో చిన్న చిన్న తేడాలు ఉన్నాయని, వయసు వ్యత్యాసం తక్కువగా ఉందనే సాకుతో ఓట్లు తొలగిస్తున్నారు. ఫిబ్రవరి 14తో ఈ ప్రక్రియ ముగుస్తుంది.

# నా నేతృత్వంలోనే ప్రభుత్వం ఏర్పాటు

**చెన్నై:**అన్నాసమాధి వద్ద శశికళ ప్రకటనచెన్నై: అసెంబ్లీ ఎన్నికల తర్వాత తన నేతృత్వంలోనే కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పటి నుంచి రాష్ట్రంలో 'అమ్మ పాలన' మళ్లీ ఆరంభమవుతుందని మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు శశికళ వ్యాఖ్యానించారు. మంగళవారం ఉదయం మెరీనాబీచ్‌లో మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై సమాధి వద్ద తన అనుచరులతో కలిసి నివాళు లర్పించారు.ఆ సందర్భంగా ఆమె అనుచరులంతా 'ద్రోహులను, శత్రువులను ఓడించి శశికళ నాయకత్వంలో అధికారంలోకి వస్తాం' అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడే ఉన్న విలేఖరులు శశికళ దగ్గరకు వెళ్ళి సొంత పార్టీ పెట్టబోతున్నారా? అని ప్రశ్నించగా, తమ శత్రువులు ఎవరో, ద్రోహులు ఎవరో రాష్ట్ర



ప్రజలందరికీ తెలుసునని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన నేతృత్వంలో అమ్మ ప్రభుత్వం ఏర్పడుతు ందని,అది ఎలా జరుగనుందో త్వరలోనే అందరూ చూస్తారని నర్మగర్భంగా బదులిచ్చారు. అన్నాడీఎ ంకే అవినీతి పార్టీ అని టీవీకే నేత విజయ్ విమర్శి ంచడం గర్హనీయమన్నారు. రాష్ట్రంలో అన్నాడీఎంకే పాలన ఎలా సాగిందో ప్రజలందరికీ తెలుసునని, ప్రస్తుతం ప్రజలంతా మళ్ళీ 'అమ్మ పాలన' ఎప్పుడొస్తుందా? అని ఎదురుచూస్తున్నారని శశికళ వెల్లడించారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ ఇద్దరు జైషే ఉగ్రవాదుల హతం



**ఉదంపూర్:** జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో బుధవారంనాడు ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాక్‌కు చెందిన ఇద్దరు జైషే మమ్మద్ (జీవవీ) ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిలో ఒకరిని ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా చురుకుగా పనిచేస్తున్న 'జైషే' టాప్ కమాండర్ అవు మావియాగా, మరొకరిని జబ్బర్ అనే ఉగ్రవాదిగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. 'కియా' పేరతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టగా, ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.అధికారుల సమాచారం ప్రకారం, జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం అందడంతో భద్రతా దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మిలిటెంట్లు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పారిపోయారు. నిఘా డ్రోన్ వారిని ఒక గుహలో దాక్కుకున్నట్టు గుర్తించడంతో భద్రతా బలగాలు చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.గుహ మొదట్లో ఒక ఉగ్రవాది, గుహలోపల మరొక ఉగ్రవాది మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. వారి నుంచి ఒక ఎం-4 కార్బైన్, ఒక ఏకే-47 రైఫిల్, మరికొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

# మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేత



**మణిపుర్ :**మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన ముగిసింది. ఈ మేరకు రాష్ట్రపతి పాలన ఎత్తివేస్తూ గెజిట్ విడుదల చేసింది. మణిపుర్ నూతన సీఎంగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ సాయంత్రం 6గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము.

# పార్లమెంట్ ప్రజాస్వామ్య దేవాలయం- చర్చకు భయం ఎందుకు- కేంద్రంపై ప్రియాంక గాంధీ ఫైర్




**న్యూఢిల్లీ :** పార్లమెంట్ సమావేశాల వేళ అధికార పక్షం తీరుపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాల సమయంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం భయపడుతుంది కాబట్టే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వడం లేదన్నారు. పార్లమెంటు అనేది ప్రజాస్వామ్య దేవాలయమని, అక్కడ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే అభ్యంతరం ఏంటని ఆమె ప్రశ్నించారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆమె మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ఎంపీల సస్పెన్షన్? గురించి కూడా ప్రియాంక ప్రస్తావించారు. 'కొత్తగా ఏం జరిగింది? ఈ విధంగా జరగడం ప్రతి సమావేశంలోనూ మీరు చూస్తున్నారు. ఈ సమస్య కేవలం ప్రతిపక్ష నాయకులను మాట్లాడనివ్వకపోడం మాత్రమే కాదు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రాథమిక సమస్య. పార్లమెంట్ ఒక దేవాలయం. ఇక్కడ ఎవరైనా తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు" అని ప్రియాంక పేర్కొన్నారు.మరోవైపు, మాజీ ఆర్మీ చీఫ్? ఎం ఎం నరవణే రాసిన పుస్తకం గురించి కూడా ఆమె మాట్లాడారు. అందులో జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించిన కీలక అంశాలు ఉన్నాయని ఆరోపించారు. 'నాకు తెలిసినంత వరకు ఆ పుస్తకంలో, చైనా దళాలు మన దేశంపై దాడి చేసినప్పుడు మన అగ్రనాయకత్వం ఎలా స్పందించిందో తెలియజెప్పే అంశాలు అందులో ఉన్నాయి' అని ప్రియాంక పేర్కొన్నారు.ఎప్?స్టీన్? ఫైల్స్? గురించి కూడా ప్రియాంక ప్రశ్నలను లెవనెత్తారు. ఈ విషయం గురించి పార్లమెంట్?లో కాకుండా మరెక్కడ ప్రస్తావించాలని ప్రియాంక ప్రశ్నించారు. ఈ విషయంపై రాహుల్ గాంధీని సమర్థిస్తూ ఆమె ప్రియాంక మాట్లాడారు. రాహుల్?గాంధీ పార్లమెంట్?లో మాట్లాడకుండా ఆయన్ను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు.

# ముగ్గురు అమ్మాయిల ఆత్మహత్య డైరీలో సంచలన విషయాలు

**యూపీ, ఫిబ్రవరి 04:** ఉత్తరప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ కారణంగా ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారని వార్తలు వినిపించాయి. అయితే ఈ ఘటనకు సంబంధించి తాజాగా మృతుల గదిలో పోలీసులకు లభించిన డైరీలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. అలానే ఓ ప్రత్యక్ష సాక్షి చెప్పిన మాటలు అందరినీ షాక్‌కు గురి చేశాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే...ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి.. బుధవారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో తాము నివాసం ఉండే భవనంలోని 9వ అంతస్తు నుంచి పడిపోయి మృతిచెందారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆ అమ్మాయిలు నివాసం ఉండే గదికి వెళ్లిన పోలీసులుకు ఓ డైరీ లభ్యమైంది. 'సారీ నాన్న.. నన్ను క్షమించండి. డైరీలో రాసినవి అన్నీ చదవండి. ఎందుకంటే.. ఇవి నిజాలు కాబట్టి. ఇప్పుడే చదవండి నాన్న' అని డైరీలో రాసి ఉంది. చివర్లో కన్నీరు పెడుతున్న ఎమోజీ ఉంది. ఆ ముగ్గురిలో ఒకరు గదిలో ఓ గోడపై.. 'నేను చాలా చాలా ఒంటరిగా ఉన్నాను, నా జీవితం చాలా చాలా ఒంటరిగా ఉంది' అని రాశారు. దీంతో ఈ ఘటనలో మరేదో ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# పెళ్లి చేసుకునేందుకు – ఏది సరైన వయసు?

మీ అమ్మాయికి పెళ్లెప్పుడు? అబ్బాయికి సంబంధాలు చూస్తున్నారా? ఏరా, మంచి జాబ్ చేస్తున్నావ్, పప్పన్నం పెట్టడానికి ఆలస్యమెందుకు చేస్తున్నావ్? నేనిప్పుడే పెళ్లి చేసుకోను, కాస్త స్థిరపడ్డాక చూస్తా! సమాజంలో రోజూ వినిపించే ప్రశ్నలివి. మూడు పదుల వయసు వచ్చినా కూడా పెళ్లికి సిద్ధపడట్లేదు నేటితరం! జీవితంలో సెట్? అయిన తర్వాతే పెళ్లి అంటున్నారు నేటి పిల్లలు. ఏ వయసులో తీరాల్సిన ముచ్చట ఆ వయసులో తీరాలంటున్నారు పెద్దలు! మరి, వీరిద్దరిలో ఎవరు కరెక్టు? అసలు యువత పెళ్లికి ఎందుకు విముఖత చూపుతోంది? దీనివల్ల ఎలాంటి సమస్యలు వస్తాయి? వంటి అంశాలను ఇక్కడ చూద్దాం.విముఖత ఎందుకు? :ఆర్థిక అస్థిరత : ప్రస్తుతం ఉద్యోగం దొరకడం మాత్రమే కాదు, దాన్ని నిలుపుకోవడమూ పెద్ద ఛాలెంజ్?గా మారింది. తక్కువ జీతాలు, పెరుగుతున్న జీవన






వ్యయాలు, ఈఎంఐలు ఇవన్నీ యువత భవిష్యత్తును అనిశ్చితికి గురిచేస్తున్నాయి. 'నా జీవితాన్నే గడపలేకపోతున్నాను, ఇంకొకరి బాధ్యత ఎలా తీసుకోగలను?' అనే భయం యువతలో పెరుగుతోంది.కెరీర్?కు ప్రాధాన్యం : చదువు, ఉద్యోగం, స్వీయ గుర్తింపుతో జీవితాన్ని నిర్మించుకోవాలంటున్నారు. వివాహం వల్ల కెరీర్ ఆగిపోతుందేమో, కుటుంబ బాధ్యతలు పెరిగి లక్ష్యాలను సాధించలేమనేమో అనే భయం పెరిగిపోయింది.విఫలమైన వివాహాల ప్రభావం : గొడవలు, కుటుంబ హింస, విడాకులు వంటి సమస్యలు ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో వివాహాన్ని ఒక సమస్యల పుట్టగా భావిస్తున్నారు. ఒకరి తప్పు వల్ల మరొకరి జీవితం నాశనం అవుతుండడం చూసి వివాహం అంటేనే ఒకవిధమైన భయం పెరుగుతోంది.స్వేచ్ఛకు అలవాటు : ఒంటరిగా జీవించడం వల్ల స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవచ్చనే అభిప్రాయం బలపడుతోంది. వ్యక్తిగత జీవితాన్ని ఆస్వాదించడానికి కూడా పెళ్లి అడ్డుగా ఉంటుందని నమ్మే వారి సంఖ్య పెరుగుతోంది. వివాహం అంటే సర్దుకుపోవాలని, రాజీ పడాల్సి వస్తుందని భావిస్తూ పెళ్లి చేసుకోవడానికి త్వరగా మొగ్గు చూపలేకపోతున్నారు.మానసిక సమస్యలు : ఆందోళన, డిప్రెషన్, ట్రామా వంటి మానసిక సమస్యలు కూడా యువతలో ఎక్కువవుతున్నాయి. అలాంటి స్థితిలో ఉన్నవారంతా "మానసికంగా స్థిరంగా లేనప్పుడు వివాహం చేసుకోవడం సమంజసం కాదేమో?" అని తమను తాము ప్రశ్నించుకుంటున్నారు .ఒంటరితనం : వయసు పెరిగే కొద్ది స్నేహాలు తగ్గుతాయి. కుటుంబంతోనూ ఎక్కువగా గడిపేందుకు వీలు పడదు. ఈ పరిస్థితి రాను రానూ మరింత ఇబ్బందిగా మారుతుంది. ఈ క్రమంలో భావోద్వేగ మద్దతు లేకపోవడం వల్ల ఒంటరితనం తీవ్రమవుతుంది.కుటుంబ ఒత్తిడి, విమర్శలు : "ఇంకెప్పుడు పెళ్లి?" పెళ్లి చేసుకోకుండా ఎంత సంపాదించి ఏం లాభం?' వంటి ప్రశ్నలు మానసికంగా గాయపరుస్తాయి."డెస్టినేషన్ వెడ్డింగ్?" ప్లాన్ చేస్తున్నారా? – మనకు దగ్గర్లోనే అద్భుతమైన ప్రదేశాలు!రాజీ, పేచీ : 30 ఏళ్ల వయసు దాటిన తర్వాత మంచి జీవిత భాగస్వామి దొరకడం కష్టం. అనేక రకాలుగా రాజీపడాల్సి వస్తుంది. బాగా వయసు మీరిన తరువాత పెళ్లి చేసుకోవడం వల్ల, అమ్మాయి, అబ్బాయిలో స్వతంత్ర భావాలు అధికమై, తమ మాటే నెగ్గాలని పట్టుదల పెరుగుతుంది. సర్దుకుపోయే తత్వం తగ్గిపోతుంది. దాంతో చిన్న చిన్న సమస్యలకే విడాకుల వరకూ వెళ్తారని నిపుణులు చెబుతున్నారు.వృద్ధాప్యంలో భద్రతా సమస్యలు : పెళ్లి ఆలస్యమైతే, ఆ ప్రభావం సంతానంపైనా, వారి అలనాపాలనపైనా పడుతుంది. ఈ పరిస్థితి మానసికంగా, శారీరకంగా కుంగదీస్తుంది.సామాజిక అసమతుల్యత : వివాహాలు తగ్గితే జనాభా నిష్పత్తి మారుతుంది. యువ జనాభా తగ్గుతుంది. వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. ఫలితంగా సమాజంపై ప్రభావం పడుతుంది.వయసు మీరినా పెళ్లి చేసుకోకపోతే పిల్లలు పుట్టే అవకాశాలు తగ్గుతున్నాయంటున్నారు డాక్టర్లు. వయసు పెరిగే కొద్దీ అమ్మాయిల్లో పెల్విక్ బోన్స్ బలహీనపడి సాధారణ ప్రసవమయ్యే అవకాశాలు తగ్గుతాయట.సంతాన సాఫల్యతా తగ్గుతుంది. ఈ క్రమంలో అండాశయాన్ని ఉత్తేజిత పరిచే మందులు వాడాల్సి వస్తుంది. అప్పుడు 'ఒవేరియన్ హైపర్ సిమ్యులేషన్ సిండ్రోమ్' ఎదురవుతుంది. అది శరీరంలోని మిగిలిన వ్యవస్థల్ని ప్రభావితం చేస్తుందని చెబుతున్నారు. అందుకే సరైన సమయంలో పెళ్లి చేసుకోవాలని సూచిస్తున్నారు.

# కేరళ "సూక్ష్మ" వ్యూహం – ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా?

జాతీయ, రాష్ట్ర పక్షులు, జంతువులను చూశాం. కేరళ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి బ్యాసిలస్ సబ్టిలస్ అనే బ్యాక్టీరియాను 'రాష్ట్ర సూక్ష్మజీవి' ప్రకటించింది. మంచి సూక్ష్మజీవులపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ చర్యను చేపట్టింది. దేశంలో ఇలాంటి నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందింది. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణలో సూక్ష్మజీవుల పాత్రపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వాటి ఫలితాలను సమాజహితానికి అందుబాటులోకి తీసుకురావడానికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మైక్రోబయోమ్?ను కూడా ప్రారంభించింది. ఈ క్రమంలో బ్యాసిలస్ సబ్టిలస్ అంటే ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం!
సూక్ష్మజీవులు అనగానే ఎక్కువ మందికి వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌లే గుర్తొస్తుంటాయి. కానీ, కంటికి కనిపించకపోయినా మానవులకు, ప్రకృతికి ఇతోధికంగా సేవలు అందించే 'మంచి బ్యాక్టీరియా' కూడా ఉంటుంది. నిజానికి, పర్యావరణంలో హానికారక బ్యాక్టీరియా 1 శాతం లోపే. మిగతా 99 శాతం, ప్రయోజనకరమైనవో, తటస్థమైనవో కావడం గమనార్హం. భారత్?కు ఇప్పటికే ల్యాక్టోబ్యాసిలస్ బల్గేరికస్‌ను జాతీయ సూక్ష్మజీవిగా ప్రకటించింది. ఒక రాష్ట్రం కూడా ఆ ఏమిటీ బ్యాసిలస్ సబ్టిలస్ :కేరళ ప్రభుత్వం ఎంచుకున్న బ్యాసిలస్ సబ్టిలస్ సూక్ష్మజీవి, నేలలో, మానవ పేగుల్లో ఎక్కువగా ఉంటుంది. ఇది కడ్డీ ఆకృతిలో ఉండే గ్రామ్ పాజిటివ్ రకం బ్యాక్టీరియం. ప్రకృతి, ఆరోగ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.ఈ సూక్ష్మజీవి తీవ్ర వేడి, అతినీలలోహిత రేడియోధార్మికత, అత్యంత ప్రతికూలంగా ఉండే రోదసి వాతావరణాన్ని తట్టుకోగలదు. ఏకంగా ఆరేళ్ల పాటు అంతరిక్షంలో మనుగడ సాగించడం ద్వారా ఒక రికార్డు సృష్టించింది. అమెరికా ఉపగ్రహంపై ఇది అన్నేళ్లపాటు జీవించింది.మొక్కలకూ ఇది ప్రోబయాటిక్‌గా ఉపయోగపడుతుంది. శిలీంధ్రాలు, బ్యాక్టీరియా నుంచి రక్షణ కల్పిస్తుంది. వృద్ధిని పెంపొందిస్తుంది. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.మానవుల, జంతువుల ప్రోబయోటిక్స్‌కు ఇది సురక్షితమైందని వెల్లడైందిరైబోఫ్లావిన్ వంటి విటమిన్లు, యాంటీబయాటిక్స్ వంటి వాటి ఉత్పత్తికి దీన్ని ఉపయోగిస్తుంటారు. బయోటెక్నాలజీలో దీన్ని విరివిగా వాడుతుంటారు. పులియబెట్టిన ఆహార పదార్థాల్లో ఉంటుంది. అమైలేజ్‌లు, ప్రొటియాజెస్ వంటి 60 శాతం వాణిజ్య ఎంజైమ్?ల ఉత్పత్తిలో దీని ప్రమేయం ఉంటుంది.కొన్ని రకాల బ్యాసిలస్ సబ్టిలస్?ను సెల్ఫ్ హీలింగ్ కాంక్రీటులో ఉపయోగిస్తారు. అక్కడ అవి క్యాల్షియం కార్బొనేట్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా పగుళ్లను నింపుతాయి.ప్రయోజనకర సూక్ష్మజీవులు : సూక్ష్మజీవులతో ఫెర్మెంటేషన్ టెక్నాలజీ మార్కెట్ విలువ భారత్‌లో రూ. 40 వేల కోట్ల మేర ఉండొచ్చని అంచనా. 2030 నాటికి అది రూ. 72



వేల కోట్లకు పెరొగొచ్చని హొరైజన్ గ్రాండ్ వ్యూ రీసెర్చ్ పేర్కొంది. యాంటీ బయోటిక్స్, టీకాలు, ఎంజైమ్‌లు, ఔషధాల్లో వాడే ఏపీఐల ఉత్పత్తికి ఉపయోగించే బ్యాక్టీరియా ఫెర్మెంటేషన్ దీనికి అదనం. బయోఫర్టిలైజర్లు, బయోపెస్టిసైడ్ల ఉత్పత్తికి కూడా బ్యాక్టీరియాను వాడుతుంటారు. ఈ పరిశ్రమలో ప్రధానంగా ల్యాక్టోబ్యాసిలస్, బైఫిడోబ్యాక్టీరియం, బ్యాసిలస్ రకాలపై ఆధారపడుతుంటారు.చికిత్సల్లో : సూక్ష్మజీవులు ఆధారిత చికిత్సలు కూడా వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఇందులో ఒక వ్యక్తి పేగుల్లోని బ్యాక్టీరియాను విశ్లేషించి, వాటి ఆధారంగా చికిత్సలను అందిస్తున్నారు. ఈ చికిత్సల్లో, ప్రయోజనకర బ్యాక్టీరియాను ప్రోది చేసి, హానికరమైన వాటిని తగ్గిస్తున్నారు. మానవ శరీరంలో 100 లక్షల కోట్ల బ్యాక్టీరియా ఉంటుంది. అందులో 85 శాతం ప్రయోజనకరమైనవే.

చీూజు : ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ఆంధ్రాలో శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం- ఒక్కసారి దర్శిస్తే చాలు మోక్షం ఖాయం!

అనంత పద్మనాభ స్వామి అనగానే ముందుగా గుర్తొచ్చేది కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయం. ఆ ఆలయానికి చెందిన అపారమైన ధనం సంపద. అంతటి ధనిక ఆలయం కానప్పటికీ మన తెలుగు రాష్ట్రంలో కూడా చారిత్రక ప్రసిద్ధమైన అనంత పద్మనాభ స్వామి ఆలయం ఉంది. గుహాలయాలుగా ప్రసిద్ధి చెందిన అతి ప్రాచీనమైన ఈ ఆలయం ఎక్కడ ఉంది? ఆలయ విశేషాలేమిటో ఈ కథనంలో చూద్దాం.

**అతి ప్రాచీనం- చరిత్రాత్మకం**

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి అతి ప్రాచీనమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన గ్రామం. విజయవాడ ప్రకాశం బ్యారేజి దాటి మంగళగిరి రహదారి పై కొద్దిగా ముందుకు వెళ్లి అమరావతి రోడ్డులో 5 కి.మీ దూరంలో ఉండవల్లి శ్రీ అనంతపద్మనాభ స్వామి గుహాలయాలు వెలసి ఉన్నాయి. ఉండవల్లి గుహలుగా ప్రసిద్ధి చెందిన ఈ గుహాలయాలు క్రీ.శ 420 –620 ప్రాంతంలో ఆంధ్రదేశాన్ని





పాలించిన విష్ణుకుండినుల కాలం నాటి నిర్మాణాలుగా చరిత్ర పరిశోధకులు భావిస్తున్నారు. విష్ణు కుండినులు మొదట్లో బౌద్ధమతానుయాయులుగా అనంతరం హిందూమతాన్ని ప్రోత్సహించినట్లు చరిత్ర చెపుతోంది.

**నిర్మాణ సోయగం**

గుహాలయాల నిర్మాణ కౌశలం చూస్తే 'ఆహా!' అనిపిస్తుంది. ఒకే కొండను నాలుగంతస్తుల గుహాలయాలుగా, విశాలమైన విహారాలుగా, మందిరాలుగా, అందమైన స్థంభాలుగా, బౌద్ధ, శైవ, వైష్ణవ దేవతామూర్తులుగా వివిధా కృతుల్లో మలచి ఉండడం చూస్తుంటే ఆనాటి శిల్పుల అనన్య శిల్ప నైపుణ్యానికి ఎవరైనా వందనాలు సమర్పించాల్సిందే! గుహాలయంలో శ్రీ అనంత పద్మనాభుని 20 అడుగుల ఏకశిలా విగ్రహం చూపరులను ఆకట్టుకుంటుంది. మరి నాలుగు అంతస్థులతో ఉన్న ఈ గుహాలయంలో ఏ అంతస్తులో ఏమేమి విశేషాలు ఉన్నాయో చూద్దాం.

**మొదటి అంతస్తు**

ఉండవల్లి గుహాలయంలో మొదటి అంతస్తులో గుప్తుల, చాళుక్యుల కాలపు శిల్ప నిర్మాణం కనిపిస్తుంది. అయితే ఇవి అసంపూర్తిగానే ఉన్నాయి. తొలుత బౌద్ధ సన్యాసుల విహారాలుగా ఉండేటట్లుగా వీటి నిర్మాణం ప్రారంభమైంది. ఈ గుహల్లో ఒక గుహ నుంచి ఇంకో గుహలోకి వెళ్ళడానికి మార్గం ఉంటుంది. అలాగే విశాలమైన తిన్నెల నిర్మాణాన్ని కూడా చూడవచ్చు.

**రెండో అంతస్తు**

మొదటి అంతస్తు నుంచి మెట్లమార్గం ద్వారా రెండో అంతస్తుకు చేరుకోవచ్చు. ఈ అంతస్తులో గతంలో త్రిమూర్తుల మందిరాలు ఉండేవని అంటారు కానీ ప్రస్తుతం వాటి తాలూకు అవశేషాలు మాత్రమే మిగిలున్నాయి. త్రిమూర్తుల ఆలయాలు ఉన్నట్లుగా భావించే గదులు, మందిరాలకు సన్నని తీగలున్న తలుపులు ఉంటాయి. మూసిన తలుపుల వెనుక చీకట్లో ఏవేవో దేవతామూర్తులను పెకలించిన గుర్తులు మాత్రం అస్పష్టంగా కన్పిస్తాయి.

**మూడో అంతస్తు చారిత్రక నేపథ్యం**

రెండో అంతస్థు నుంచి మూడో అంతస్తులో చేరుకోవడానికి మెట్ల మార్గం ఉంటుంది. ఈ గుహాలయంలోని నాలుగు అంతస్తులు కూడ రాయిను తొలిచి చేసిన నిర్మాణాలే కాని, ఇవి పునాదులు వేసి నిర్మించినవి కానీ, ఇందులోని విగ్రహాలు ఎవరో ప్రతిష్ఠించినవి కానీ కావు. మూడో అంతస్తు పూర్తిగా విష్ణు సంబంధమైన గుహాలయం. సాధారణంగా గుహాలయాలు అనగానే బౌద్ధ, జైన గుహాలయాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి కాని వైష్ణవ గుహాలయం ఉండటం ఇక్కడొక ప్రత్యేకతగా చెప్పవచ్చు. కొండవీడు రెడ్డి రాజులకు రాజ్యాధికారిగా పనిచేసిన మాధవరెడ్డి ఈ అనంత పద్మనాభుని గుహాలయం నిర్మించినట్లుగా ఇక్కడి శాసనాల ద్వారా తెలుస్తోంది.

**ఎన్నో శిథిల శాసనాలు**

రెండో అంతస్తుకు వెళ్ళే మెట్ల మార్గం ప్రక్కనే ఉన్న కొండపై శాసనం ఒకటి శిథిలమై కన్పిస్తోంది. ఇక్కడ నుంచి 9 కి.మీ దూరం సొరంగమార్గం మంగళగిరి నరసింహా స్వామి కొండపైకి ఉందని, ఆ రోజుల్లో సాధువులు, మునులు కృష్ణానదిలో స్నానానికి, పానకాల నరసింహుని దర్శనానికి ఈ మార్గం ద్వారా రాకపోకలు సాగించేవారని ప్రచారం జనబాహుళ్యంలో ఉంది. ఈ విషయాన్ని 'మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి' అనే వ్యాసంలో ప్రస్తావించడం జరిగింది. అంతేకాకుండా రాజులు యుద్ధ సమయాల్లో శత్రు రాజులకు తెలియకుండా సైన్యాన్ని ఈ సొరంగమార్గం ద్వారా తరలించేవారని కూడా తెలుస్తోంది. అయితే ప్రస్తుతం వివిధ కారణాల వల్ల ఈ సొరంగ మార్గాన్ని మూదివ్యానుభూతి కలిగించే మూడో అంతస్తు

మూడో అంతస్తులోనికి వెళ్లడానికి గుహను అందంగా తొలిచి మెట్ల మార్గాన్ని నిర్మించారు. మెట్లను మలిచిన విధానంలోనే ఈ అంతస్తు ప్రత్యేకత తెలుస్తుంది. ఈ గుహాలయంలోకి ప్రవేశించడమే ఓ వింత అనుభూతిని కల్గిస్తుంది. రెండు వరుసల స్తంభాల మధ్యలో విశాలమైన మండపం భక్తులకు విశ్రాంతి మండపంగా ఆహ్వానిస్తుంది. మండపం స్థంభాలపై దశావతారాలు, వివిధ దేవతామూర్తుల శిల్పాలు కొలువు తీరి చూడగానే పలకరిస్తున్నట్లుగా భ్రాంతి కలుగుతుంది. ఎడమవైపు తిరిగితే వరుసగా కొండను తొలిచి తీర్చిదిద్దిన శిల్పాలు కనువిందు చేస్తాయి. వాటిలో ముందుగా మనల్ని ఆకర్షించేది గణనాయకుడైన వినాయకుని రమణీయ శిల్పం.

**మహా గణపతి రమణీయ శిల్పం**

మూడో అంతస్తులో మహా గణపతి రమణీయ శిల్పం సందర్శకులకు అమితమైన ఆనందాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే గజాననుని తొండం మీద కన్పించే గజచర్మం ముడతలు సహజత్వానికి ప్రతీకగా నిలుస్తాయి.

**ఉగ్ర నరసింహుడు**

గుహాలయంలో మూడో అంతస్తులో ఒక మందిరంలో ఉన్న ఉగ్ర నరసింహుని స్వరూపం ఈ మండపంలోనే మూడు ప్రదేశాల్లో మనకు కన్పిస్తుంది. వీటిలో రెండు మాత్రం ఒకే పోలికతో ఉంటాయి. ఇవి కుడ్యచిత్రాలు కావడం విశేషం. ఈ కుడ్యచిత్రాల్లో శంకరునితో పాటు వివిధ దేవతల శిల్పాలను కూడా దర్శించుకోవచ్చు.

**శ్రీ లక్ష్మీదేవితో ఆదివరాహస్వామి**

మండపంలోని స్థంభాలపై కన్పించే చిత్రాల్లో అత్యంత అరుదుగా కన్పించే లక్ష్మీ సమేతుడైన ఆదివరాహస్వామి విగ్రహం రమణీయంగా దర్శనమిస్తుంది.

**కుడ్య శిల్పం**

ఈ మండపంలో మరొక స్తంభం మీద కన్పించే ఉగ్ర నరసింహుని శిల్పం తక్కిన రెండు శిల్పాల కంటే పూర్తి వైవిధ్యం కల్గిన మనోహర శిల్పం. ఈ శిల్పంలో హిరణ్యకశ్యపుని సంహరిస్తున్న నరసింహునిలో మహోగ్ర రూపం స్పష్టంగా గోచరిస్తుంది.

**వామనావతార ఘట్టం**

నరసింహుని శిల్పంకు సమీపంలోనే వామనావతార ఘట్టం కూడా చిత్రించి ఉంది. ఆ పక్కనే మరొక స్తంభం మీద హనుమత్ సందేశం ఘట్టం కూడా చిత్రించి ఉండటాన్ని గమనించవచ్చు.

**శ్రీ అనంతపద్మనాభస్వామి**

మూడో అంతస్తు చివరి మందిరంలో శ్రీ అనంత పద్మనాభుడు కొలువుతీరి ఉన్నాడు. సుందర మనోహరమైన ఈ స్వామి స్వరూపాన్ని చూడటానికి రెండు కళ్లు చాలవని భక్తులు భక్తిపారవశ్యంతో చెబుతుంటారు. నల్లని గ్రానైటు ఏకశిలా నిర్మితమైన ఈ విగ్రహం స్వరూపం ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తుంది.

**సమ్మోహితులను చేసే అనంత పద్మనాభుని స్వరూపం**

శ్రీ అనంత పద్మనాభ స్వామి పద్మపత్ర



విశాలాక్షుడై, అనంతశయనుడై, గగనచరులైన దేవతలందరూ ఆనందం నాట్యం చేస్తుంటే, జయవిజయులు పాదాల చెంత కర్తవ్య పాలనలో ఉండగా, మహర్షులు తపో నిమగ్నులై ఉండగా, ఆకాశంలో గరుడుడు నాట్యం చేస్తుంటే, అద్భుత స్వరూపంతో దర్శనమిస్తాడు. ఆ దివ్య మంగళ రూపాన్ని దర్శించి తరించాల్సిందే కానీ వర్ణింపనలవి . ప్రతిరోజు ఉదయం ఏడున్నర నుంచి తొమ్మిది గంటల వరకు స్వామి దర్శనం ఉంటుంది. ఒక్క శనివారం రోజు మాత్రం దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు. స్వామిని దర్శించిన భక్తులు చల్లే పసుపుకుంకుమలతో నల్లని అనంత పద్మనాభుని రూపం ఎర్రగా మారిపోయి, ఎర్ర గ్రానైట్?తో చెక్కిన శిల్పంలా గోచరించడం

**నాభి కమలం నుంచి ఉద్భవించిన బ్రహ్మ**

శ్రీ పద్మనాభుని మందిరంలోని అనంత పద్మనాభుని పరిశీలనగా గమనిస్తే స్వామి తో పాటు పద్మోద్భవుడైన బ్రహ్మ, ఆనందంలో సురేశుని కీర్తిస్తున్న దేవతలు, ధ్యానంలో ఉన్న రుషులు, ఆయుధ పాణులైన అంగరక్షకులు, గగనంలో నర్తిస్తున్న గరుత్మంతుని కూడా దర్శించవచ్చు.

**నాగబంధం**

మూడో అంతస్తులో మండపానికి వెలుపల నాగబంధం ఉందని ప్రతీతి. అందువల్ల ఈ పరిసరాల్లో ఎక్కడో విలువైన సంపద కాని, విలువైన చారిత్రాత్మక గ్రంథాలు కానీ ఉండి ఉంటాయన్న ప్రచారం కూడా ఉంది.

**ఎలా చేరుకోవాలి?**

విజయవాడకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి బస్సు, రైలు, విమాన సౌకర్యాలు ఉన్నాయి. విజయవాడ నుంచి ఉండవల్లి సెంటరు వరకు బస్సులో వచ్చి అక్కడ నుంచి ఈ గుహాలయాలకు సులభంగా చేరుకోవచ్చు. అత్యంత అద్భుతమైన శిల్ప కళాసంపదకు తార్కాణంగా నిలిచే ఉండవల్లి గుహాలయాలు దర్శించడం ఒక అరుదైన, అపురూపమైన దివ్యానుభూతి. మనం కూడా ఉండవల్లి గుహాలయాలను దర్శిద్దాం. దివ్యానుభూతిని సొంతం చేసుకుందాం.

ఓం శ్రీ అనంత పద్మనాభ స్వామినే నమః!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం



# వయసు కేవలం సంఖ్య మాత్రమే....

- ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలి
- టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ

తదుపరి ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియా మాజీ కెప్టెన్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా అనే ప్రశ్నకు దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనీ ఆసక్తికర సమాధానం చెప్పాడు. ఫిట్‌నెస్, ఫామ్ ఉంటే వయసుతో సంబంధం లేకుండా అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగవచ్చని అభిప్రాయపడ్డాడు.వయసు కేవలం సంఖ్య మాత్రమేనని, 35 ఏళ్ల వ్యక్తి 22 ఏళ్ల కుర్రాడి కంటే ఫిట్‌గా ఉంటే అతనే జట్టుకు అర్హుడని అభిప్రాయపడ్డాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు కూడా ఫిట్‌గా ఉండి, ఫామ్‌లో ఉంటే వన్డే ప్రపంచకప్ 2027 ఆడుతారని బదులిచ్చాడు. వయసును కాకుండా ఫామ్, ఫిట్‌నెస్‌ను పరిగణలోకి తీసుకోవాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు పరోక్షంగా చురకలంటించాడు. 'రోహిత్, కోహ్లీ వన్డే ప్రపంచకప్ 2027లో ఎందుకు ఆడకూడదు నా దృష్టిలో వయసు కొలమానం కాదు. ప్రదర్శన, ఫిట్‌నెస్ మాత్రమే జట్టులో కొనసాగాలా వద్దా అనేదానికి ప్రమాణాలు. అందుకే ఎవరికీ ఎమి చెప్పాల్సిన అవసరం లేదని నేను భావిస్తాను. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా ఉండాలి. జట్టులో అందరినీ ఒకేలా చూడాలి. నేను అరంగేట్రం చేసినప్పుడు నాకు 24 ఏళ్లు. ఆ సమయంలో ఎవరూ వచ్చి నాకు ఏం చెప్పలేదు. కాబట్టి ఇప్పుడు నేను భారత్ తరపున ఏడాది ఆడినా... మరో పదేళ్లు, 20 ఏళ్లు ఆడినా.. నా వయసు గుర్తు చేయాల్సిన అవసరం లేదు.వయసు ఏమాత్రం కొలమానం కాదు. ఫిట్‌నెస్ అత్యంత ముఖ్యం. 22 ఏళ్ల కుర్రాడు కూడా ఫిట్‌గా లేకపోతే జట్టుకు అనవసరం. విరాట్ కోహ్లీ లేదా భవిష్యత్తులో వచ్చే ఇతర ఆటగాళ్ల గురించి మాట్లాడితే.. ఒకరికి 30 ఏళ్లు దాటాయి కాబట్టి వారు తదుపరి ప్రపంచకప్ ఆడగలరా లేదా అనే నిర్ణయించాల్సింది మనం కాదు. అది వారి వ్యక్తిగత నిర్ణయం. వారు ఫిట్‌గా ఉండి నిలకడగా రాణిస్తూ.. దేశంలో కోసం ఆడాలనే పట్టుదలతో ఉంటే.. వారిని ఎందుకు పక్కనపెట్టాలి. అనుభవం కలిగిన ఆటగాళ్లు ఎలా వస్తారు సచిన్ టెండూల్కర్ మినహా ఎవరూ 20 ఏళ్ల వయసులోనే అనుభవం సంపాదించలేదు. సచిన్‌లా 16-17 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ ఆడినవారు చాలా తక్కువ. అంతర్జాతీయ క్రికెట్ చాలా భిన్నమైనది. ప్రస్తుతం అనుభవం కలిగిన ఆటగాళ్లు కావాలంటే 30-33 ఏళ్ల వయసున్న వారు కావాలి. కానీ మనం 20, 25 మ్యాచ్‌లు ఆడిన వారిని అనుభవం కలిగిన ఆటగాళ్లుగా చూస్తున్నాం. ఒత్తిడిలో ఆడితేనే నిజమైన అనుభవం వస్తుంది. కేవలం మ్యాచ్‌ల సంఖ్యతో కాదు.ముఖ్యంగా లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసేవారు, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసేవారికి అనుభవం చాలా ముఖ్యం. ఉత్కంఠగా సాగే మ్యాచ్‌లు ముగింపుకు వచ్చినప్పుడు వారి అనుభవం కీలక పాత్ర పోషిస్తుంది. ఒక బౌలర్‌గా నేను 10-20 సార్లు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవాలంటే, కనీసం నేను 80-85 మ్యాచ్‌లు ఆడాలి.

## వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర హాఫ్ సెంచరీ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ దుమ్మురేపాడు. అండర్ 19 ప్రపంచకప్ 2026లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో జరిగిన సెమీఫైనల్లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. 311 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. 33 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లతో 68 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తొలి వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. క్రీజులో ఉన్నంత సేపు అఫ్గాన్ బౌలర్లకు చెమటలు పట్టించాడు.ఎదుర్కొన్న 33 బంతుల్లోనే క్రికెట్‌లో ఉన్న షాట్స్ అన్ని ఆడాడు. తన ట్రేడ్ మార్క్ పుల్ షాట్‌తో పాటు ఫ్లిక్, కవర్ డ్రైవ్, ఆన్ డ్రైవ్‌లతో బౌండరీలు రాబట్టాడు. అతను కొట్టిన నాలుగు సిక్స్‌లు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. 22 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అతను ఇచ్చిన సునాయస క్యాచ్‌ను అఫ్గాన్ ఫీల్డర్ ఉజైరుల్లా నియాజై వదిలేసాడు. ఈ అవకాశంతో చెలరేగిన అతను 24 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.అనంతరం మరో రెండు బౌండరీలు, సిక్స్ బాదిన సూర్యవంశీ.. పుల్ షాట్ ఆడబోయి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తన ప్రధాన బలమైన పుల్ షాట్ కొన్ని సార్లు అతనికి బలహీనతగా మారుతుంది. పాకిస్థాన్‌తో జరిగిన గత సూపర్ సిక్స్ మ్యాచ్‌లో సూర్యవంశీ పుల్ షాట్ ఆడబోయే వికెట్ పారేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ అదే తరహాలో వెనుదిరిగాడు.



## డబ్ల్యూపీఎల్ ఫైనల్ చేరిన దిల్లీ క్యాపిటల్స్



డబ్ల్యూపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్ మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. వడోదర వేదికగా గుజరాత్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 169 పరుగుల లక్ష్యాన్ని దిల్లీ 15.4 ఓవర్లలో ఛేదించి వరుసగా నాలుగోసారి ఫైనల్‌కు చేరింది. దిల్లీ గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది.టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది గుజరాత్‌ను జెయింట్స్. 7 వికెట్ల కోల్పోయి 168 పరుగులు చేసింది. దిల్లీ బౌలర్లు అంతకుముందు గుజరాత్ జెయింట్స్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బెత్ మూనీ నిలవడంతో జెయింట్స్ పోటీ ఇచ్చే స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను బౌలర్లు ఒత్తిడికి గురిచేశారు. ఆరంభలోనే గుజరాత్‌కు పెద్ద షాక్ తగిలింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ సోఫీ డివైన్‌ను పెవిలియన్‌కు చేర్చింది షినెలి హెన్రీ. దీంతో సోఫీ ఆరు పరుగులకే వెనుదిరిగింది. జాగ్రత్తగా ఆడుతున్న మూనీకి తోడుగా అనుష్క శర్మ నిలిచింది. కానీ అది ఎక్కువ సేపు నిలవలేదు. ఆరో ఓవర్లో అనుష్క, ఆష్లీ గార్డ్‌నర్‌లను నందని శర్మ వరుస బంతుల్లో పెవిలియన్‌కు చేర్చింది. 9వ ఓవర్లో కనికను మిన్ను మణి వెనక్కి పంపింది. దీంతో 9 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 60 పరుగులే చేయగలిగింది గుజరాత్.అయితే వికెట్లు పోతున్నా మూనీ మాత్రం గ్రీజులో నిలిచింది. కానీ దిల్లీ బౌలర్ల కట్టడికి ధీటుగా ఆడలేకపోయింది. ఆమెకు ఎట్టకేలకు వేర్‌హామ్ జోడి కుదరింది. దీంతో ఎదురుదాడికి దిగిన వేర్‌హామ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. కానీ గుజరాత్ ఇన్నింగ్స్ జోరందుకుంటున్న సమయంలో వేర్‌హామ్‌ను షినెలి ఔట్ చేసింది. అయిదో వికెట్ భాగస్వామ్యానికి 61 పరుగుల వద్ద తెరపడింది. 17వ ఓవర్లో

## అండర్-19 వన్డే ప్రపంచకప్
# ఫైనల్‌కు భారత్

- అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం

అండర్-19 వన్డే ప్రపంచ కప్‌లో భారత్ వరుస విజయాలతో అదరగొడుతోంది. బుధవారం జరిగిన సెమీఫైనల్ పోరులో అఫ్గానిస్థాన్‌పై 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠభరితమైన ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ నిర్దేశించిన 311 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత్ కేవలం 41.1 ఓవర్లలోనే ఛేదించింది.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఓపెనర్లు కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఓపెనర్ ఆరోన్ జార్జ్ (115; 104 బంతుల్లో) సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (68; 33 బంతుల్లో) అఫ్గాన్ బౌలర్లపై విరుచుకుపడి ఇన్నింగ్స్‌ను పరుగులు పెట్టించాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (62) బాధ్యతాయుతంగా ఆడి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. చివర్లో విహాన్ మల్హోత్రా (38 నాటౌట్) విన్నింగ్ షాట్ కొట్టి మ్యాచ్‌ను పూర్తి చేశాడు.అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 310 పరుగులతో భారీ స్కోర్ చేసింది. ఫైజల్ షినోజాదా (110), ఉజైరుల్లా (101 నాటౌట్) అద్భుత శతకాలతో భారత బౌలర్లను ఆడుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు భారీ స్కోరు అందించారు. ఉస్మాన్ సాదత్ (39), ఖలీద్ అహ్మద్జాయ్ (31) కూడా బాగానే ఆడారు. అఫ్గాన్ చివరి 10 ఓవర్లలో ఏకంగా 111 పరుగులు చేయడం గమనార్హం. భారత బౌలర్లలో కనిష్క్ చౌహాన్, దీపేశ్ దేవేంద్రన్ చెరో రెండు వికెట్లు తీశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్‌కు ఓపెనర్లు ఉస్మాన్ సదత్(39), ఖలిద్ అహ్మద్‌జాయ్(31) శుభారంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ జోడిని దీపేష్ దేవంద్రన్ విడదీసాడు. ఖలిద్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ ఉస్మాన్‌తో కలిసి ఫైసల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. హాఫ్ సెంచరీకి చేరువైన ఉస్మాన్‌ను కాన్షిక్ చౌహన్ ఔట్ చేశాడు. దాంతో క్రీజులోకి ఉజైరుల్లా నియాజై రాగా.. ఇద్దరూ కలిసి భారత బౌలర్లను చెడుగుడు ఆడారు.ఈ క్రమంలో 55 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించిన ఫైసల్.. అనంతరం మరింత దూకుడుగా ఆడి మరో 31 బంతుల వ్యవధిలోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు కాస్త నిదానంగా ఆడిన ఉజైరుల్లా నియాజై 63 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు.



## వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఊచకోత

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్మురేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో సౌతాఫ్రికాతో ముంబై వేదికగా జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. 20 బంతుల్లోనే 53 రన్స్ చేశాడు.న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో అద్వితీయమైన ప్రదర్శన కనబర్చిన ఇషాన్ కిషన్ అదే జోరును కొనసాగించాడు. ఓపెనర్‌గా ప్రమోషన్ అందుకొని వామప్ మ్యాచ్‌లో సత్తా చాటాడు. సహచర ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి ఒకే ఓవర్లో 29 పరుగులు చేశాడు.అన్రిచ్ నోకియా వేసిన ఐదో ఓవర్ తొలి బంతికి అభిషేక్ సిక్స్ కొట్టి రెండో బంతికి సింగిల్ తీసుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ వరుసగా 6, 6, 4, 6 బాదాడు. 7 సిక్సులు, 2 ఫోర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని రిటైర్డ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఇషాన్ కిషన్ టీమిండియా ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడని ఈ మ్యాచ్ ద్వారా టీమ్ మేనేజ్‌మెంట్ హింట్ ఇచ్చింది.



## పాకిస్థాన్ నీచపు బుద్దే అంత!!

- టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నామని ప్రకటించిన పాకిస్థాన్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పాకిస్థాన్ నీచపు బుద్దే ఈ వివాదానికి కారణమని తెలిపాడు. నాలుగు రోజుల్లో పాక్ దారికొస్తుందని అభిప్రాయపడ్డాడు. కచ్చితంగా భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందని, ఆ మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు.భద్రతా కారణాల నేపథ్యంలో భారత్‌లో పర్యటించలేమని, తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. దాంతో ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 నుంచి బంగ్లాదేశ్ తప్పుకోగా.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది. అయితే ఈ నిర్ణయాన్ని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తప్పుబట్టింది. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించింది.తాజాగా ఈ వ్యవహారంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. పాకిస్థాన్ తీరును తప్పుబట్టాడు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# అవతార్ లెవల్లో వారణాసి మూవీ

**పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదరింది**

**ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారు**

**అత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాం**

**అంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు**



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ సినిమాలో మహేశ్ బాబుతో పాటు ప్రియాంక చోప్రా కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. దయచేసి నాకు ఈ సినిమాలో డ్యాన్స్ వేసే అవకాశం ఇవ్వండి. మంచి పాట ఉండేలా చూడండి' అని చెప్పాని ప్రియాంక అన్నారు. ఈ సినిమాలో వారి పాత్రల దగ్గర నుంచి కథ ఎలా మొదలైంది వరకూ మహేశ్ బాబు విశేషాలు తెలిపారు. 15 ఏళ్ల కి్రతమే రాజమౌళి దర్శకత్వంలో చేయాల్సిఉంది. ఇప్పటికి అది కుదిరింది. 'ఆర్ఆర్ఆర్' పూర్తయిన తర్వాత ఏడాది పాటు దీని స్క్రిప్ట్ గురించి ఆలోచించారు. నన్ను ఆఫీసుకు పిలిచి 'వారణాసి' స్క్రిప్ట్ గురించి చెప్పారు. కథ విని ఆశ్చర్యపోయాను. ఇప్పటివరకూ రాజమౌళి చేసిన అన్ని చిత్రాల కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఇందులో ఎన్నో అంశాలు ఉన్నాయి. యాక్షన్, అడ్వెంచర్, పురాణాలు, టైమ్ ట్రావెల్.. ఇలా ఎన్నో ఉన్నాయి. రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం నేనూ ఆసక్తిగా ఉన్నాను. ఇందులో హీరోగా చేయడానికి మొదట్లో భయపడ్డాను. రాజమౌళి కథను వివరించిన విధానం నా భయాన్ని పోగొట్టిందని మహేశ్ బాబు అన్నారు. 'వారణాసి'లో లుక్స్ కోసం ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2024 నుంచి ఈ పనిలోనే ఉన్నాం. గతేడాది జర్మనీ కూడా వెళ్లాం. నేను ఇందులో రాముడి పాత్ర పోషించాను. రాముడు అంటేనే హుందాతనం.. ఆయనకు ప్రత్యేకమైన భంగిమ ఉంటుంది. నిలబడే విధానం దగ్గర నుంచి పాత్రలో నటించడం వరకూ ఎన్నో రిహార్సల్స్ చేశాం. 2,3 నెలలు దానికోసమే కష్టపడ్డాం. రాజమౌళి నేను పరిగెత్తే విధానాన్ని కూడా మార్చారు. దానికోసం 6 నెలలు శిక్షణ తీసుకున్నాను. సినిమాలో రెండు షాట్ల కోసం ఇదంతా చేశాం. ఆయనకు సినిమాపై ఉన్న శ్రద్ధ ఎలాంటిదో చెప్పడానికి ఈ ఒక్క విషయం చాలు. ఈ సినిమా భారీస్థాయిలో విడుదలవుతుంది. 'వారణాసి' లో విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను ఎంపిక చేయడం సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఈ సినిమాలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత విభిన్నమైన, అంచనా వేయలేని పాత్ర అని ఆయన తెలిపారు. ఈ కుంభ క్యారెక్టర్ పూర్తిగా గ్రే షేడ్స్‌తో సాగుతుందని చెప్పారు. ఎప్పుడు ఏం చేస్తాడో ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఈ పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు. తన నిజజీవితానికి పూర్తిగా భిన్నమైన డార్క్ రోల్ కావడం వల్ల ఇది తనకు పెద్ద ఛాలెంజ్‌గా మారిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన వీల్‌చైర్, 'డాక్టర్ ఆక్టోపస్' తరహాలో రోబోటిక్ చేతులు వంటి ఎలిమెంట్స్‌తో పృథ్వీరాజ్ లుక్ భయానకంగా ఉండనుందని సమాచారం. కేవలం కళ్లతోనే భయపెట్టే విధంగా ఈ పాత్రను డిజైన్ చేశారనే ప్రచారం జరుగుతోంది. భారతీయ సినిమాల్లో ఇప్పటివరకు చూడని సైకలాజికల్ విలన్‌గా 'కుంభ' నిలుస్తాడని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మొత్తానికి 'వారణాసి'లో హీరో మహేష్ బాబు పోషిస్తున్న 'రుద్ర' పాత్రకు సమానంగా నిలిచే 'కుంభ' విలన్ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశముంది.





## తక్షకుడిగా వస్తున్న ఆనంద్ దేవరకొండ

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'తక్షకుడు'. గతంలో 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన దర్శకుడు వినోద్ అనంతోజు, ఆనంద్ దేవరకొండ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టీజర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే ఇది పక్కా రివెంజ్ డ్రామాగా కనిపిస్తోంది. పెళ్లయిన రోజే తన కుటుంబాన్ని కోల్పోయి, తీవ్ర గాయాలతో అడవిలో పడి ఉన్న యువకుడిని స్థానికులు కాపాడటం, ఆ తర్వాత తన పతనానికి కారణమైన వారిపై అతను తీర్చుకునే ప్రతీకారమే ఈ చిత్ర కథాంశమని అర్థమవుతోంది. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా చాలా ఇంటెన్స్ మరియు సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. ఇక 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, కాలకేయ ప్రభాకర్ కీలకమైన నెగటివ్ రోల్‌లో నటిస్తున్నారు. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.

# ఏప్రిల్ 30న పెద్ది


## కొత్త రిలీజ్ డేట్ ప్రకటన

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' విడుదల తేదీలో మార్పు చోటుచేసుకుంది. ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు చిత్ర దర్శకుడు బుచ్చి బాబు సానా అధికారికంగా ప్రకటించారు. వాస్తవానికి ఈ చిత్రాన్నిమార్చి 27న విడుదల చేయాలని భావించారు. పవన్ కల్యాణ్ కొత్త చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26న వస్తున్నట్టు ఇవాళ ప్రకటించిన నేపథ్యంలో, 'పెద్ది' విడుదల తేదీని వెనక్కి జరిపినట్టు తెలుస్తోంది. అయితే, కొత్త విడుదల తేదీ మే డే వీకెండ్‌తో కలిసి వస్తుండటంతో సమ్మర్ సీజన్‌లో సినిమాకు ఇది బాగా కలిసొస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. "అతడి రాక తేదీ మారుతుంది, కానీ అతడి దృఢ సంకల్పం మారదు" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. గ్రామీణ క్రీడా నేపథ్యంతో కూడిన యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో రామ్ చరణ్ టైటిల్ రోల్‌లో కనిపించనున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ. ఆర్. రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రాన్ని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.





## చిరుమూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.



## బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బు÷-లలెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది. గ్లింప్స్ విడుదలైన వెంటనే సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. రాజశేఖర్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ మళ్లీ పాత రోజుల్ని గుర్తు చేస్తున్నాయని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. 'ఇది రాజశేఖర్‌కు గ్యారెంటీ కంబ్యాక్ మూవీ అవుతుంది' అంటూ ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఆయన కనిపించడమే సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. శర్వానంద్‌తో పాటు రాజశేఖర్ లాంటి సీనియర్ నటుడు కీలక పాత్రలో కనిపించడం సినిమాకు అదనపు బలం అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. యూత్‌కు దగ్గరైన బైక్ రేసింగ్ కథతో పాటు అనుభవజ్ఞులైన నటుల ప్రెజెన్స్ ఉండటంతో 'బైకర్' మూవీపై అంచనాలు క్రమంగా పెరుగుతున్నాయి.




## 2026 మార్చి 26న 'ఉస్తాద్ భగత్ సింగ్'

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా ద్వారా ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. 'గబ్బర్ సింగ్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో దీనిపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రేజీ కాంబోలో సినిమా వస్తుండటంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. తాజాగా విడుదల తేదీని ప్రకటించడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో పవన్ సరసన టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ శ్రీలీల నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనుంది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. వేసవి సీజన్‌ను టార్గెట్ చేస్తూ విడుదల తేదీని ప్రకటించడంతో పవర్ స్టార్ అభిమానులు సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. చఖదీూాఅమీఖతీఎష్ట్ర2౯ష్ట్ర అనే హ్యాష్‌ట్యాగ్‌తో ఈ వార్తను ట్రెండ్ చేస్తున్నారు.

